

రాజధాని నిర్మాణానికి రండి

- పట్టభద్రులకు ప్రభుత్వ అవకాశం
- సీఆర్‌డీఏలో ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం
- రాజధాని నిర్మాణంలో పాల్గొనవచ్చు
- అవగాహన, నైపుణ్యాన్ని పెంచుకోవచ్చు
- గౌరవ భత్యం కూడా పొందవచ్చు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాజధాని అమరావతి నిర్మాణంలో పట్టభద్రులకు కూడా ప్రభుత్వం ఆహ్వానం పలుకుతోంది. ఇంటర్న్‌షిప్‌లకు అవకాశం కల్పిస్తోంది. మూడు నుంచి ఆరు నెలల పాటు ఈ ఇంటర్న్‌షిప్‌లు చేసుకునే వీలుంది. వీటిద్వారా పెద్ద ఎత్తున పట్టభద్రులు తగిన అనుభవాన్ని, నైపుణ్యాన్ని పెంచుకోవచ్చు. అమరావతి వంటి అంతర్జాతీయ రాజధాని నిర్మాణ పనుల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాలు పంచుకోవచ్చు.

మూడు రకాలుగా..

ఈ ఇంటర్న్‌షిప్‌ను సీఆర్‌డీఏ మూడు రకాలుగా కల్పిస్తోంది. గ్రాడ్యుయేట్ ఇంటర్న్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంటర్న్స్, యంగ్ ప్రొఫెషనల్స్ కేటగిరీలో చేయొచ్చు. తగిన గౌరవ భత్యాన్ని కూడా అందజేస్తారు. గ్రాడ్యుయేట్ ఇంటర్న్స్‌కు రూ.7,500, పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఇంటర్న్స్‌కు రూ.10 వేలు, యంగ్ ప్రొఫెషనల్స్‌కు రూ.15 వేల చొప్పున ఇస్తారు. ఇంజనీరింగ్ విభాగంలో సివిల్, స్ట్రక్చరల్, జియో టెక్నికల్, హైవే ట్రాన్స్‌పోర్టేషన్, ఎలక్ట్రికల్, పవర్ సిస్టమ్స్, మెకానికల్, ఫైర్ అండ్ సేఫ్టీ, వాటర్ సప్లై, శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ అంశాలు కలిగినవారు ఇంటర్న్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్లానింగ్ విభాగంలో అర్బన్, రీజనల్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ట్రాన్స్‌పోర్టేషన్, ఎన్విరాన్‌మెంట్, ఆర్కిటెక్చర్, ల్యాండ్‌స్కేప్, ఆర్కిటెక్చర్, అర్బన్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్ వంటి అంశాలు కలిగిన వారిని తీసుకుంటారు. ఎన్విరాన్‌మెంట్ విభాగంలో ఎన్విరాన్‌మెంట్ సైన్స్, ఎకోలజీ, ఎన్విరాన్ మేనేజ్‌మెంట్, క్లైమేట్ సైన్స్, బయో డైవర్సిటీ, రెన్యువబుల్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ ఎకనామిక్స్, మెట్రాలజీ, వేస్ట్ మేనేజ్‌మెంట్ అంశాలకు సంబంధించిన వారిని తీసుకుంటారు. ఎకనామిక్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఎకనామిక్స్, ఇంటర్నేషనల్ బిజినెస్, మార్కెటింగ్, ఫైనాన్స్, ఎంట్రప్రెన్యూర్‌షిప్, ఇన్వెస్ట్‌మెంట్, రిస్క్ మేనేజ్‌మెంట్, స్టాటిస్టిక్స్, కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ అంశాలకు సంబంధించిన వారిని ఈ ఇంటర్న్‌షిప్‌నకు తీసుకుంటారు. ఇతర విభాగాలకు సంబంధించి జీఐఎస్, కంప్యూటర్ సైన్స్, ఐటీ, కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ వంటి అంశాల్లో తీసుకుంటారు. ఔత్సాహిక విద్యాసంస్థలు కానీ, విద్యార్థులు కానీ నేరుగా సీఆర్‌డీఏకు ఈ-మెయిల్ చేయటం ద్వారా కానీ, ప్రత్యక్షంగా కార్యాలయానికి వచ్చి కానీ దరఖాస్తు చేసుకోవచ్చు.

రాబోవు విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో పెనుమార్పులు రానున్నాయి. గత ప్రభుత్వం 117 జీవో ప్రకారం ఉన్నత పాఠశాలలకు కిలోమీటరు దూరంలోని ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసింది. ఇక్కడి ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలలకు పంపింది. దీంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రాథమిక పాఠశాలలు సగానికి సగం తగ్గిపోయాయి. ఇటువంటి పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ప్రస్తుతం విద్యార్థుల సంఖ్యను బట్టి పాఠశాలలను మళ్లీ పునరుద్ధరించడం లేదా విలీనం చేసే అంశంపై కసరత్తు చేస్తోంది. దీంతో వేసవి సెలవులు ముగిసేనాటికి జిల్లాలో ఎన్ని పాఠశాలలు ఉంటాయి, ఎన్ని విలీనం అవుతాయనే అంశంపై సందిగ్ధం నెలకొంది. విద్యార్థుల తల్లిదండ్రులు తమ గ్రామంలో పాఠశాల ఉండాలని పట్టుబడితే సంబంధిత పాఠశాలలను కొనసాగించేలా కూడా నిర్ణయం తీసుకునే అవకాశం లేకపోలేదనే ప్రచారం సాగుతోంది.



సందిగ్ధం!

గ్రామాల్లో పాఠశాలల పునరుద్ధరణ, విలీనంపై విద్యాశాఖ కసరత్తు

- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అధికారుల నిర్ణయాలు
- తల్లిదండ్రులతో సమావేశమవుతున్న అధికారులు
- గ్రామాల్లోనే పాఠశాలలను కొనసాగించాలని పట్టు
- ప్రభుత్వ విధానాలు వివరించి ఒప్పించే ప్రయత్నం
- పాఠశాలల విలీనం, చేర్పులు, మార్పులపై రాని స్పష్టత

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం: జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ ప్రభుత్వ పాఠశాలలు ఉండేలా 1, 2 తరగతులతో ఫౌండేషన్ పాఠశాలలను ఏర్పాటు చేయాలనే ఆలోచన పాలకులు చేస్తున్నారు. ఈ పాఠశాలల్లో 20 మంది పిల్లలు ఉంటే సింగిల్ టీచర్ అక్కడ కొనసాగుతారు. బేసిక్ ప్రాథమిక పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు పాఠశాలలు కొనసాగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ అన్ని తరగతుల్లో 20 మంది విద్యార్థులు ఉంటే ఒక టీచరు, 60 మంది ఉంటే ఇద్దరు టీచర్లు, 60 మంది కంటే ఎక్కువ మంది ఉంటే ముగ్గురు టీచర్‌లు ఉంటారని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ఈ తరహా పాఠశాలల్లో అన్ని తరగతుల్లో 15 నుంచి 20 మంది లోపు విద్యార్థులే ఉండటంతో ఈ పాఠశాలలను కొనసాగించాలా.. వద్దా అనే సందిగ్ధం నెలకొంది.

మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింపు

మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి నుంచి 5వ తరగతి వరకు 60 మంది విద్యార్థులు ఉంటే అక్కడ తరగతికి ఒక టీచరు చొప్పున ఐదుగురు టీచర్‌లను ఉంచే ప్రతిపాదన ఉంది. అంతమంది విద్యార్థులు లేకపోవడంతో ఈ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను ప్రభుత్వం ఇటీవల 45కు తగ్గించింది. ఈ ఏడాది పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభమయ్యే ఏప్రిల్ 23వ తేదీ నాటికి పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఈ తరహా పాఠశాలలను కొన సాగించాలని నిర్ణయించింది. ఇంత మంది విద్యార్థులు సంబంధిత పాఠశాలల్లో లేకుంటే గతంలో ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన 3, 4, 5 తరగతుల పిల్లలను మోడల్ పాఠశాలలకు తరలించాలనే ఆలోచన అధికారులు చేస్తున్నారు. అప్పటికీ కూడా 45 మంది పిల్లలు లేకుంటే ఉన్నత పాఠశాల నుంచి 3, 4, 5 తరగతులను విడగొట్టి ప్రాథమిక పాఠశాలగా అదే ప్రాంగణంలో కొనసాగించాలనే ఆలోచన ఉంది. ఆరు నుంచి 10వ తరగతి వరకు ఉన్నత పాఠశాలగా కొనసాగిస్తారు.

ప్రాథమికోన్నత పాఠశాలల సంగతేంటి?

జిల్లాలో 279 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఒకటి నుంచి ఎనిమిది వరకు తరగతుల్లో 60 మంది పిల్లలు ఉంటే వాటిని అప్‌గ్రేడ్ చేయాలనే ఆలోచన ఉంది. అయితే ఈ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేస్తే సరిపడా తరగతి గదులు, సౌకర్యాలు లేవనే కారణంగా వీటిని అప్‌గ్రేడ్ చేయాలా.. వద్దా అనే సందిగ్ధత నెలకొంది. సరిపడా సౌకర్యాలు లేని ప్రాంతాల్లోని ప్రాథమికోన్నత పాఠశాలలను మూసివేసి, దగ్గరలోని పాఠశాలలకు విద్యార్థులను పంపాలనే యోచన చేస్తున్నారు. ఇలా చేస్తే పాఠశాలలు దూరమైతే విద్యార్థుల ప్రయాణ ఖర్చుల కింద నెలకు రూ.600లను ఇవ్వాలనే ప్రతిపాదన ఉంది. దీంతో పాటు 2022లో ఏర్పాటు చేసిన 10+2 పాఠశాలల్లో ఇంటర్మీడియట్ కోర్సులను రద్దు చేయాలనే ప్రతిపాదన కూడా ఉంది. 2024-25లో బాలికల కోసం ఏర్పాటు చేసిన 10+2 పాఠశాలల్లో విద్యాబోధన చేసేందుకు అర్హత ఉన్న ఉపాధ్యాయులకు ప్రత్యేక ఇంక్రిమెంట్లు ఇచ్చి నియమించారు. ఇవి జిల్లాలో 18 వరకు ఉన్నాయి. వీటిని కొనసాగించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

పాఠశాల విద్యా కమిటీలపై ఒత్తిడి

విద్యావ్యవస్థలో చేపట్టిన నూతన విధానాల్లో భాగంగా పాఠశాలల విలీనం, మార్పులు, చేర్పులపై మండల స్థాయిలో ఎంఈవోలు గ్రామాల్లో తిరిగి పాఠశాలల విలీనం ఏ కారణంతో మిగతా 6లో..

ఇంగ్లీష్ మీడియంలోనే బోధన

రాబోయే విద్యా సంవత్సరం నుంచి 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలోనే విద్యాబోధన జరగనుంది. తెలుగు సబ్జెక్టు మినహాయించి, మిగిలిన అన్ని సబ్జెక్టులను ఇంగ్లీష్‌లోనే బోధిస్తారు. పాఠ్యపుస్తకాలు మాత్రం పాత పద్ధతిలో ఎడమవైపు పేజీలో తెలుగులో, కుడి వైపు పేజీలో ఇంగ్లీష్‌లో ఉంటాయి.

నిద్దరోతున్న నిఘా!

- ఇంద్రకీలాద్రిపై భద్రత ప్రశ్నార్థకం
- ఘాట్‌రోడ్డులో బయటపడ్డ నిఘాలోపం
- సీసీ కెమెరాల ఏర్పాటు అంతంతమాత్రమే
- భక్తుల కారులో బంగారు ఆభరణాలు చోరీ
- సీసీ కెమెరాలు లేకపోవడం కారణంగానే..
- చోరీ తర్వాత అధికారుల హడావిడి
- ఆగమేఘాలపై నిఘా నేత్రాల ఏర్పాటు

ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో భక్తుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఓ పక్క దళారులు.. భక్తులను నిలువు దోపిడీ చేస్తుంటే, మరోపక్క దొంగలు.. భక్తుల బంగారు ఆభరణాలు కాజేస్తున్నారు. ఏటా భక్తుల సంఖ్య పెరుగుతున్నా అందుకు తగిన సదుపాయాలు మాత్రం ఇక్కడ కనిపించడం లేదు. తాజాగా ఘాట్‌రోడ్డులో ఓం మలుపునకు ముందే నిలిపిన కారులో 241 గ్రాముల బంగారం చోరీ ఘటన ఇందుకు అద్దం పడుతోంది. ఇంద్రకీలాద్రి వద్ద దిగువ నుంచి పైవరకు విజిల్స్‌తో మోతెక్కిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది భక్తులకు ఎలాంటి భద్రతను ఇవ్వడం లేదని తెలుస్తోంది.



కీలకమైన ఓం టర్నింగ్ పాయింట్ వద్ద సీసీ కెమెరాలున్నా కనెక్షన్ ఇవ్వని దృశ్యం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన కనకదుర్గమ్మ సన్నిధికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. కొందరు మెట్లపూజ చేసుకుంటూ కొండ ఎక్కుతారు. మరికొందరు ఘాట్‌రోడ్డు మార్గంలో పైకి వెళ్తారు. ఇంకొందరు లిఫ్టు మార్గాల్లో రాజగోపురం వద్దకు చేరుకుంటారు. వీరి భద్రత కోసం కొండ మొత్తాన్ని సీసీ కెమెరాల నిఘాలో ఉంచామని అధికారులు ప్రకటిస్తున్నారు. అయితే ప్రధానమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి మిగిలిన ప్రదేశాలపై పెద్దగా అధికారులు దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంద్రకీలాద్రిపై మొత్తం 214 సీసీ కెమెరాలు ఉన్నాయి. వాటిని పర్యవేక్షించడానికి మహామండపంలో ప్రత్యేకంగా ఒక కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్వహిస్తున్నారు.

నాడు వెండి సింహాలు మాయం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చిన్న రథానికి నాలుగు వైపులా ఉండే వెండి సింహాల్లో మూడింటిని దొంగలు కాజేశారు. కరోనా సమయంలో మొత్తం లాక్‌డౌన్‌లో ఉన్నప్పుడు ఈ చోరీ జరిగింది. అప్పుడే భద్రతపై అనేక సందేహాలు వచ్చాయి. నాడు అధికారంలో ఉన్న వైసీపీ ఇంద్రకీలాద్రిని ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రతి ఏడాది దేవస్థానంపై భద్రతా ఆడిట్ జరుగుతుంది. కొద్దిరోజుల క్రితమే ఈ ఆడిట్‌ను నిర్వహించారు. ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్, ఆక్టోపస్, గ్రేహౌండ్స్ బలగాలు ఈ ఆడిట్‌లో పాల్గొన్నాయి. దేవస్థానానికి కింద నుంచి కొండ పై వరకు భద్రతాపరమైన లోపాలు ఉన్నాయని ఈ ఆడిట్‌లో స్పష్టమైంది. ఏటా జరిగే భద్రతా ఆడిట్‌లో పలు సూచనలు, సిఫార్సులు చేస్తున్నా అధికారులు పరిగణనలోకి తీసుకుంటున్న దాఖలాలు లేవు. ఘాట్‌రోడ్డులో కారులో ఉన్న బంగారు ఆభరణాలు చోరీ జరిగిన తర్వాత ఆలయ అధికారులు అత్యంత వేగంగా స్పందించారు. ఘటన జరిగిన ప్రదేశంలో చుట్టుపక్కల మొత్తం పది సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఘాట్‌రోడ్డు ప్రారంభంలో సీసీ కెమెరాలు ఉన్నాయి. తర్వాత ఓం మలుపులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఘాట్‌రోడ్డు ఎక్కిన తర్వాత మొదటి మలుపు నుంచి ఓం మలుపు చేరుకునే వరకు మధ్యలో ఎలాంటి సీసీ కెమెరాలు లేవు. సరిగ్గా ఈ ప్రాంతంలోనే చోరీ జరిగింది.

సెక్యూరిటీ గార్డులు ఉన్నా ప్రయోజనం శూన్యం

కొండకు దిగువ నుంచి పైవరకు వివిధ పాయింట్లలో సెక్యూరిటీ గార్డులు ఉంటారు. వారంతా మిగతా 6లో..



రోడ్డుపై అగ్నిప్రమాదానికి గురైన ప్రైవేటు బస్సు

ఫిట్‌నెస్‌పై అనుమానాలు!

- పీఎన్‌బీఎస్ ఎదుట ప్రైవేటు ట్రావెల్స్ బస్సు దగ్ధం
- కాలం తీరిన బస్సు కావడంవల్లే ప్రమాదం!
- అందుబాటులో లేని మంటలు ఆర్పే పరికరాలు
- రవాణాశాఖ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

(ఆంధ్రజ్యోతి, బస్‌స్టేషన్): బెజవాడలో పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ (పీఎన్‌బీఎస్) ఎదురుగా ఎన్‌హెచ్ - 65పై ఏవీఆర్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు గురువారం దగ్ధమైన నేపథ్యంలో బస్సు ఫిట్‌నెస్‌పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కృష్ణలంక వైపు ప్రయాణికులు ఎవరు లేకుండా వెళుతున్న బస్సులో ఒక్కసారిగా పొగలు రావడంతో స్థానికులు డ్రైవర్, క్లీనర్‌ను అప్రమత్తం చేశారు. దీంతో వారు వెంటనే కిందకు దిగారు. స్థానికుల సమాచారం మేరకు ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఏసీ షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగి ఉండవచ్చునని జిల్లా అసిస్టెంట్ ఫైర్ అధికారి కె.వినయ్ పేర్కొన్నారు. అయితే ఘటనా స్థలానికి రవాణా శాఖ అధికారులు రాకపోవటం అనేక అనుమానాలకు తావిస్తోంది. లారీలు, కార్లు, ద్విచక్రవాహనాలను పరీక్షించినట్టుగా ప్రైవేటు బస్సులను పరీక్షించకుండా వదిలేస్తున్నారన్న విమర్శలు ఎప్పటి నుంచో వస్తున్నాయి. ప్రైవేటు బస్సుల యాజమాన్యాల నుంచి పెద్ద ఎత్తున మామూళ్లు వస్తుండటం వల్లనే రవాణా శాఖ అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపణలు ఉన్నాయి. షార్ట్ సర్క్యూట్ కావటానికి ఏసీ కారణమని చెబుతున్నా.. వాస్తవానికి వైరింగ్ సిస్టమ్ సరిగా లేదని తెలుస్తోంది. వైర్ల ద్వారా వచ్చే షార్ట్‌సర్క్యూట్‌ను నియంత్రించే వ్యవస్థలు లేకపోవటంతోనే ఈ ప్రమాదం సంభవించినట్టు సమాచారం. ప్రైవేటు బస్సులపై మిగతా 6లో..

ప్రయాణికులు ఉంటే పెనుప్రమాదమే!

బస్సులో ప్రయాణికులు లేకపోవడంతో సరిపోయింది. అదే ప్రయాణికులు ఉంటే.. డ్రైవర్ ముందు భాగం నుంచి రావాలి. బస్సులో దట్టంగా పొగలు వ్యాపించాయి. ఈ పొగ నుంచి ప్రయాణికులు బయట పడటం అనేది దుర్లభమనే చెప్పాల్సి వస్తుంది. సరిగ్గా బస్సు మధ్యభాగంలో పొగలు వ్యాపించాయి. పొగలు వ్యాపించిన కొన్ని క్షణాలకే మంటలు వచ్చాయి. ఈ మంటలు అద్దాలను పగులగొట్టుకుని మరీ బయటకు వ్యాపించాయి. ప్రయాణికులు ఉండి ఉంటే ఘోర ప్రమాదమే జరిగి ఉండేది.

మాయలేడీలు

- నగరంలో మహిళా ముఠా హల్‌చల్
- ధనవంతులే టార్గెట్‌గా పెట్టుబడుల పేరుతో వసూళ్లు
- ఖరీదైన అపార్టుమెంట్లలో ఫ్లాట్ తీసుకుని బిజినెస్
- రెట్టింపు డబ్బు ఇస్తామని చెప్పి మాయమాటలు
- రూ.56 లక్షలు ఇచ్చి మోసపోయిన ఓ కాలనీవాసి
- గుట్టుగా వ్యాపారం ముగించుకుని పరార్
- కాలనీవాసి ఇంట్లో డాక్యుమెంట్ల చోరీకి యత్నం
- డాక్యుమెంట్లు దొరక్కపోవడంతో బంగారం దొంగతనం
- కొమ్ముకాస్తున్న టీడీపీ నేత.. ఎట్టకేలకు మహిళ అరెస్టు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరానికి చెందిన వంకాయలపాటి పావని, చెన్నైకు చెందిన కొప్పకొండ లక్ష్మి, ఆమె తల్లి శ్యామల, వైజాగ్‌కు చెందిన గంగాధర్, కావ్య అనే మరో మహిళ ఓ గ్యాంగ్‌గా ఏర్పడ్డారు. నగరాలు, పట్టణాల్లో ధనవంతులు ఉండే కాలనీల్లోని అపార్టుమెంట్లలో ఫ్లాట్లను అద్దెకు తీసుకుంటారు. అందులో టేబుళ్లు, కుర్చీలు, కంప్యూటర్లు అమర్చుకుని ఓ పేరు పెడతారు. అలాగే, నగరంలోని వెటర్నరీ కాలనీలో 'యుక్తాస్' పేరుతో ఓ కంపెనీని ప్రారంభించారు. ఆ ప్రాంతంలో ఉన్న ధనవంతులను టార్గెట్ చేసుకుని వ్యవహారాలు నడిపించారు. చెన్నైకు చెందిన లక్ష్మి స్వస్థలం నెల్లూరు. ఆమె భర్త తమిళనాడులోని జెన్‌కోలో ఉద్యోగి. భర్త, పిల్లలు అక్కడ ఉంటే ఆమె విజయవాడలో కంపెనీని ప్రారంభించింది. పెద్ద కుమార్తె పేరు యుక్త. చిన్న కుమార్తె పేరు లాస్య. రెండింటిని కలిపి యుక్తాస్ అని నామకరణం చేసింది. ఈ కంపెనీలో కావ్యను రీజనల్ మేనేజర్‌గా పరిచయం చేసింది. వంకాయలపాటి పావనిని డైరెక్టర్‌గా చూపించింది. ఇలా.. లక్ష్మి, పావని కలిసి ధనవంతులకు వల వేయడం మొదలుపెట్టారు. తమ కంపెనీలో పెట్టుబడులు పెడితే ఏడాదిలోపే రెట్టింపు చేసి చూపిస్తామని ఆశలు రేకెత్తించారు. తమంతా ఆన్‌లైన్ షేర్ ట్రేడింగ్ నిర్వహిస్తున్న కంపెనీని ప్రారంభించామని చెప్పుకొచ్చారు.

పెడితే పెట్టుబడి... లేకపోతే అప్పు

లక్ష్మి, పావని ధనవంతులకు వల వేసేటప్పుడు రెండు రకాల ప్రణాళికలు అమలు చేస్తారు. తమ కంపెనీలో పెట్టుబడులు పెట్టాలని మొదట ఆఫర్ ఇస్తారు. ఈ ప్లాన్‌లో అవతలి వ్యక్తులు పడకపోతే కంపెనీ మల్టీనేషనల్ కంపెనీగా మారిందని, దానికి పెట్టుబడిగా కొంత అప్పు ఇవ్వాలని అడుగుతారు. విధంగా లక్ష్మి వెటర్నరీ కాలనీకి చెందిన రాజవర్ధనరావు అనే వ్యక్తి నుంచి రూ.56 లక్షలు తీసుకుంది. ఆయన ఫ్లాట్‌కు దిగువనే లక్ష్మి అద్దెకు ఉండేది. లక్ష్మి వేసిన స్కెచ్‌కు తల్లి శ్యామల వంత పాడేది. ఆయన దగ్గర నుంచి అప్పు తీసుకునేటప్పుడు చెన్నై నుంచి లక్ష్మి భర్త దయాకర్ వచ్చాడు. ఈ ఇద్దరూ కలిసి అప్పునకు సంబంధించి ప్రామిసరీ నోట్లు రాసిచ్చారు. గడువు ముగిసినా అప్పు తీర్చకపోవడంతో ఆయన లక్ష్మిని ప్రశ్నించారు. ఒత్తిడి పెరగడంతో మిగతా 6లో..

విద్యుత్ చార్జీలు పెంచం

- వైసీపీ అడ్డగోలు విధానాలతోనే సర్దుబాటు చార్జీలు : మంత్రి గొట్టిపాటి 6లో

పెదపులిపాక ఇసుక రోడ్డుకు మహిళ బలి

- భర్తతో కలిసి కరకట్ట మీదుగా తాడిగడప వస్తుండగా ప్రమాదం

8లో

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా గోపి బాధ్యతల స్వీకరణ



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా జి.గోపి మచిలీపట్నంలోని జిల్లా ప్రధాన కోర్టులో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన అరుణ సారిక తిరుపతి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఆమె స్థానంలో విశాఖపట్నం నుంచి బదిలీపై గోపి ఇక్కడకు వచ్చారు.



జిల్లాస్థాయి ప్రథమ, ద్వితీయ విజేతలకు బహుమతులు అందజేస్తున్న 'ఆంధ్రజ్యోతి' బ్రాంచి మేనేజర్ వి.మురళి

'ఆంధ్రజ్యోతి' లక్కీడ్రా జిల్లా విజేతలకు బహుమతుల ప్రదానం

గుణదల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : 'ఆంధ్రజ్యోతి' 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రచురితమైన కూపన్ల లక్కీ డ్రాలో జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ కార్యాలయంలో బహుమతులను అందజేశారు. జిల్లా స్థాయిలో కూపన్ల డ్రా కార్యక్రమం మార్చి 24న ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు చేతుల మీదుగా జరిగిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో విజేతలైన పాఠకులకు 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళి బహుమతులను అందజేశారు. ప్రథమ విజేత పెనమలూరు మండలం గోసాల గ్రామానికి చెందిన పోలవరపు రామకోటేశ్వరమ్మ కోరిక మేరకు బైక్‌కు బదులు నగదును చెక్కు రూపంలో అందజేశారు. ద్వితీయ విజేత కృష్ణాజిల్లా గుడివాడటౌన్‌కు చెందిన జంధ్యవరపు కృష్ణమూర్తికి రిఫ్రిజిరేటర్, తృతీయ విజేత విజయవాడ సీతారామపురానికి చెందిన వీవీ చంద్రశేఖర్‌కు ఎల్‌సీడీ టీవీ అందజేశారు. కార్యక్రమంలో సర్క్యులేషన్ డీజీఎం పి.ఎస్.వాసు, సర్క్యులేషన్ మేనేజర్ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బాగోతాలు బయటపడతాయనే!

- గోవుల మృతిపై భూమన అసత్య ప్రచారం
- నెట్టెం రఘురాం ధ్వజం



జగ్గయ్యపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఐదేళ్ల పాలనలో టీటీడీలో జరిగిన అవినీతి బాగోతం సిట్ దర్యాప్తులో బట్టబయలవుతాయనే భయంతోనే వైసీపీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ధ్వజమెత్తారు. హేతువాదినని, వెంకటేశ్వరస్వామి వారిని నల్లరాయి అని మాట్లాడిన వ్యక్తి టీటీడీ ఛైర్మన్‌గా లడ్డూ ప్రసాదాల్లో నెయ్యి కల్తీతో పాటు ఎన్నో దురాగతాలకు పాల్పడ్డాడని, వాటిని కప్పిపుచ్చుకునేందుకు గోశాలలో గోవులు చనిపోతున్నాయని విషప్రచారం చేస్తున్నాడని దుయ్యబట్టారు. ఆయన గురువారం తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ, వైసీపీ హయాంలో గోవులకు గ్రాసంలోను, దాణాలోను కక్కుర్తిపడ్డారని, అప్పుడు మృతి చెందిన గోవుల ఫోటోలను ఇప్పుడు బయటపెట్టి దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. భూమన ఆరోపణలకు టీటీడీ ఈవో శ్యామలరావు పూర్తి ఆధారాలతో ఖండించారని చెప్పారు. పంచాయతీపరిషత్ ఉపాధ్యక్షుడు ముల్లంగి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, భూమన అసలు హిందువే కాదని ఆరోపించారు.



సమావేశం మధ్యలోనే వెళ్లిపోతున్న ఛైర్‌పర్సన్ కస్తూరిబాయి

ఉత్కంఠ, హైడ్రామా నడుమ తిరువూరు కౌన్సిల్ వాయిదా!

తిరువూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాజీనామా ఆమోదానికి గురువారం చేపట్టిన కౌన్సిల్ అత్యవసర సమావేశం తీవ్ర ఉత్కంఠ, హైడ్రామా నడుమ వాయిదా పడింది. ఛైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం మధ్యాహ్నం ప్రారంభమైంది. తొలుత అజెండాలోని నాలుగు అంశాల్లో ఛైర్‌పర్సన్ రాజీనామా విషయంపై పార్టీ అధ్యక్షుడు(వైసీపీ)ఆదేశాల ప్రకారం పదవికి రాజీనామా చేస్తున్నట్టు, దానిని అంగీకరించాలన్నారు. టీడీపీ ఫ్లోర్‌లీడర్ షేక్ అబ్దుల్ హుస్సేన్ మాట్లాడుతూ, మున్సిపాలిటీలో మంచి పాలన సాగించాలని ప్రజలు 17 మందిని కౌన్సిలర్లుగా ఎన్నుకుంటే, అంతర్గత కుమ్ములాటలతో రెండేళ్లుగా పాలనను కుంటుపరుస్తున్నారని, రాజీనామాతో అభివృద్ధి మరింత కుంటుపడుతుందని అన్నారు. దీనిపై ఛైర్‌పర్సన్ తరపున 7వ వార్డు కౌన్సిలర్ పరసా శ్రీనివాసరావు(బీరువాలబాబు)మాట్లాడుతూ, ఛైర్‌పర్సన్ వ్యక్తిగత కారణాలతోనే రాజీనామాచేస్తున్నారని, మరోకారణం లేదని చెబుతుండగానే ఛైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. దీంతో కౌన్సిలర్లు అయోమయానికి గురయ్యారు. తర్వాత ఛైర్‌పర్సన్ అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నారన్న సమాచారం రావడంతో సమావేశం కొనసాగించాలా లేదా అన్న మీమాంసలో వైసీపీ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు తర్జనభర్జన పడ్డారు. అనంతరం సమావేశం వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. సమావేశం వాయిదాతో ఉత్కంఠకు తెరపడింది.

ఈ నెలాఖరుతో ముగియనున్న ఈ కేవైసీ గడువు

- ఎన్టీఆర్ జిల్లాలో చేయించాల్సిన వారు లక్షకు పైగానే..

మొగల్రాజపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డుల్లో ఈ కేవైసీ చేయించుకోవల్సిన వారికి ఈ నెలాఖరుతో గడువు ముగియనుంది. ఎన్టీఆర్ జిల్లాలో ఈకేవైసీ చేయించుకోవాల్సినవారు ఇంకా 1,25,049మంది ఉన్నారు. వీరిలో ఐదేళ్లలోపు వారు 22,834 మంది, 80 సంవత్సరాలు పైబడినవారు 1001 మంది ఉన్నారు. ఈ రెండు కేటగిరీల వారికి ఈ కేవైసీ అవసరం లేదు. మిగిలిన 1,01,214 మంది ఈ కేవైసీ చేయించుకోవాలి. మార్చి 31తో ముగిసిన గడువును ఏప్రిల్ 30 వరకు పొడిగించారు.



2021లో నాటి ప్రభుత్వం ఇచ్చిన రైస్ కార్డుల్లో రెండు, మూడేళ్ల వయస్సు పిల్లలు తప్పనిసరిగా ఆధార్ సెంటర్‌లో వేలిముద్రలు నవీకరించుకోవలి. వారం రోజుల తర్వాత రేషన్ డీలర్ వద్దగాని, ఎండీయూ వాహనం వద్ద గాని ఈ కేవైసీ చేయించుకోవాలి. వీరు కాకుండా దీర్ఘకాలం రేషన్ తీసుకునే సమయంలో వేలిముద్ర వేయని వారిలో అత్యధిక శాతం ఆరు నుంచి పదేళ్ల వయస్సు వారు, ఉద్యోగాల నిమిత్తం వేరే ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారి పేర్లు ఉంటాయి. ఇంటర్‌నెట్‌లో గూగుల్‌లో ఈపీడీఎస్1 అని టైప్ చేస్తే ఈపీడీఎస్.ఏపీ.జీవో వి.1అని వస్తుంది. దీనిని ఒపెన్ చేస్తే పలు ఎంపికలు ఉంటాయి. వాటిలో రైస్ కార్డు సెర్చ్‌లోకి వెళ్లి మీ కార్డు నెంబరు టైప్ చేయాలి. కార్డు వివరాలు వస్తాయి. ఆ వివరాల్లో పేర్ల చివర ఈ కేవైసీ అయిందా లేదా అనే సమాచారం ఉంటుంది. అవ్వకపోతే వెంటనే ఈ కేవైసీ చేయించుకోవాలి.





రియల్ బూమ్!

జాతీయ రహదారి చెంతన.. నవ్యాంధ్ర రాజధాని అమరావతికి సమీపంలో.. పెద్ద రైల్వేస్టేషన్, భారీ కార్గో టెర్మినల్ ఏర్పాటు కానుండటంతో రియల్టర్ల చూపు ఎన్టీఆర్ జిల్లా పరిటాలపై పడింది. ఇప్పటికే పలు సంస్థలు ఏర్పాటవుతుండటం, సమీప భవిష్యత్తులో పెద్ద నగరంగా రూపాంతరం చెందనుండటంతో ఇక్కడి భూములకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. అనూహ్యంగా భూముల ధరలకు రెక్కలు వచ్చి రూ.కోట్లు పలుకుతున్నాయి.

(కంచికచర్ల - ఆంధ్రజ్యోతి)

- అందరిచూపు పరిటాల వైపు..!
- అమరావతికి అతి చేరువలో..
- జాతీయ రహదారులను అనుసంధానిస్తూ..
- లాజిస్టిక్ హబ్‌గా అడుగులు
- తరలి వస్తున్న భారీ సంస్థలు
- రూ. కోట్లలో ధర పలుకుతున్న భూములు

ఆంజనేయస్వామి విగ్రహం వెనుక ఉన్న భూములు

కంచికచర్ల మండలం పరిటాల గ్రామ పరిధిలో భూముల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. జాతీయ రహదారితో పాటుగా ప్రధాన రహదారుల వెంబడి భూముల ధరలు రూ. కోట్లు పలుకుతున్నాయి. ఈనెల మొదటి వారంలో ఆంజనేయ స్వామి విగ్రహం-గనిఆత్కూరు వెళ్లే రోడ్డుకు మధ్యలో సర్వీస్ రోడ్డు పక్కన ఎకరం రూ.3.48 కోట్లు పలికింది. బేరసారాలు కుదరటంతో వారంలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తయింది. పదిరోజుల క్రితం చెరువు కట్ట వద్ద ఓ రియల్టర్ ఎకరం రూ.2.50 కోట్ల వంతున 1.33 ఎకరాలు కొనుగోలు చేశారు. ఇటీవల సర్వీస్ రోడ్డుకు ఫర్లాంగు దూరంలో గనిఆత్కూరు వెళ్లే రోడ్డులో ఎకరం రూ. 2.20 కోట్లకు బేరం కుదిరింది. కొద్ది నెలల క్రితం జాతీయరహదారికి కిలోమీటరు దూరంలో పీఆర్ రోడ్డు పక్కన గుంటూరుకు చెందిన వ్యాపారులు ఎకరం రూ.1.25 కోట్ల వంతున 26 ఎకరాలు కొన్నారు. ఎంవీఆర్ ఇంజనీరింగ్ కళాశాల వెనుక భాగంలో సైతం ఎకరం రూ.1.50 కోట్ల నుంచి రూ. 1.75 కోట్ల ధర పలుకుతోంది. మున్ముందు ధర ఇంకా పెరుగుతుందన్న ఆశతో రైతులు భూములు అమ్మేందుకు సిద్ధపడటం లేదు. పిల్లల చదువులు, అప్పుల భారం, ఇతరత్రా ఆర్థిక అవసరాల నిమిత్తం తప్పని పరిస్థితుల్లో కొద్ది మంది మాత్రమే తమ భూములను విక్రయిస్తున్నారు.

రహదారుల అనుసంధానం

65వ నెంబరు జాతీయరహదారిపై ఉన్న పరిటాల విజయవాడకు 30 కిలోమీటర్లు, కృష్ణానదికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రతిపాదిత అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్), ఇన్నర్ రింగు రోడ్డు (ఐఆర్ఆర్)కు మధ్యలో ఉంటుంది. నాణ్యత కలిగిన రోడ్డు మెటల్, బిల్డింగ్ కంకర పుష్కలంగా దొరుకుతుంది. ఇప్పటికే పరిటాల పరిధిలో లైట్ వెయిట్ బ్రిక్స్ ఫ్యాక్టరీ ఉంది. రెండు భారీ ఆయిల్ బంకులున్నాయి. మరో బంకు నిర్మాణంలో ఉంది. దొనబండ వరకు జాతీయరహదారి వెంబడి పలుసంస్థలు, కంపెనీలు ఏర్పాటవుతున్నాయి. ముఖ్యంగా రిలయన్స్ ఆధ్వర్యంలో కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న బయో ఎనర్జీ ప్లాంట్ పనులు తుది దశకు చేరుకున్నాయి. రెండు ఇంజనీరింగ్ కళాశాలలున్నాయి.

రవాణాకు కీలకంగా కార్గో టెర్మినల్

పరిటాల గ్రామ రెవెన్యూ పరిధిలో రీ సర్వే రికార్డుల ప్రకారం 6,187 ఎకరాల భూమి ఉంది. కొత్తగా ఏర్పాటు చేయనున్న ఎర్రుపాలెం-అమరావతి రైల్వే లైను, స్టేషన్ కోసం ఈ గ్రామ పరిధిలో ప్రభుత్వం 75 ఎకరాలు తీసుకోనుంది. ఈ మార్గంలో పరిటాల అతిపెద్ద స్టేషన్ అని అధికారులు ఇప్పటికే ప్రకటించారు. దీనికితోడు సరుకు రవాణాకు సంబంధించి రైల్వే లైనుకు అనుసంధానంగా భారీ కార్గో టెర్మినల్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్రం ప్రకటించగా.. రోడ్డు, జల, రైల్వే రవాణాకు సంబంధించి ఇది కీలకం కానున్నది. కాకినాడ, మచిలీపట్నం, కృష్ణపట్నం పోర్టులకు, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, కోలకత్తా, ఇతర ప్రధాన నగరాలకు అనుసంధానం చేయనున్నారు. దీంతో పరిటాల ముఖ్యమైన లాజిస్టిక్ హబ్‌గా అభివృద్ధి చెందుతుందని, రాజధాని అమరావతికి ప్రధాన ఆదాయ వనరుగా మారుతుందని కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ పేర్కొనటంతో వెయ్యి ఎకరాలకు పైగా తీసుకుంటారన్న ప్రచారం మాత్రం జరుగుతోంది. ఈ నేపథ్యంలో రియల్టర్లు, వ్యాపారులు, బడాబాబుల చూపు పరిటాలపై పడింది. ఈ గ్రామ పరిధిలోని భూములను కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. ధరకు వెనుకాడటం లేదు. అయితే ఎక్కువ మంది రైతులు భూములు అమ్మేందుకు నిరాకరిస్తున్నారు. ఒకటి రెండేళ్లు ఆగితే ఇంకా ధర పెరుగుతుందన్న ఆశతో ఉన్నారు.

విద్యుత్ చార్జీలు పెంచం


- వైసీపీ అడ్డగోలు విధానాలతోనే సర్దుబాటు చార్జీలు : మంత్రి గొట్టిపాటి





ఉయ్యూరులో టిడ్కో ఇళ్ల వద్ద 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్, శిలాఫలకం ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం వచ్చాక రూపాయి కూడా విద్యుత్ చార్జీలు పెంచలేదని, రానున్న రోజుల్లో కూడా పెంచబోమని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఉయ్యూరులో జెమినీ స్కూల్ సమీపాన టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద రూ. 4.5 కోట్లతో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌లతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి పెంచకుండా ఎక్కువ ధరకు కొనుగోలు చేయడం తదితర కారణాల వల్ల ప్రజలపై రూ.20వేల కోట్ల భారం పడిందన్నారు. వైసీపీ అడ్డగోలు విధానాల పాపం విద్యుత్ బిల్లుల్లో సర్‌చార్జీ ఇప్పటికి వెంటాడుతోందని ఆరోపించారు. జిల్లాలో అవసరమైన పది 132 కేవీ సబ్‌స్టేషన్లు ఏర్పాటుచేస్తామన్నారు. ఉయ్యూరులో నిలిచిపోయిన 132 సబ్‌స్టేషన్ త్వరలో నిర్మిస్తామన్నారు. అసత్య ఆరోపణలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. గ్రీన్‌ఎనర్జీని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని, పీఎం సూర్యఘర్‌ను అందరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ బాలశౌరి అన్నారు. బందరు పోర్టు పూర్తయిన తరువాత ఆప్రాంతంలో విద్యుత్ వినియోగం బాగా పెరుగుతుందని అందుకు తగ్గట్టుగా విద్యుత్‌శాఖ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. టిడ్కో ఇళ్లు పూర్తిచేసి త్వరలో లబ్ధిదారులకు అప్పగిస్తామని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ హామీఇచ్చారని బోడె ప్రసాద్ అన్నారు. 132 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తిచేస్తే ఉయ్యూరు పరిసర మండలాలకు విద్యుత్ సమస్య ఉండదని ఇందుకు మంత్రి చొరవ చూపాలన్నారు. ఉయ్యూరు ఛైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ ఎం.సత్యానందం, ఉయ్యూరు ఈఈ కృష్ణ నాయక్, బీవీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



చారిత్రక ఘట్టాల గుట్టు తెలపండి

- రైల్వే బ్రిడ్జిలు, వంతెనలపై 'కాఫీ టేబుల్ బుక్'కు వివరాలు పంపండి
- ఈనెల 30 వరకు గడువు

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ డివిజన్ పరిధిలోని రైల్వే బ్రిడ్జిలు, వంతెనలపై 'భారతీయ రైల్వే 172వ ఆవిర్భావ దినోత్సవం' సందర్భంగా 'కాఫీ టేబుల్ బుక్'ను తీసుకురానున్నది. విజయవాడ డివిజన్ పీఆర్వో నుస్రత్ ఎం. మండ్రూపకర్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ ఇందుకు సంబంధించిన చారిత్రాత్మక అంశాలను ఆసక్తిపరులు పంపించాల్సిందిగా కోరారు. ఈనెల 30 లోగా ఈమెయిల్ లేదా పోస్టు ద్వారా పంపించవచ్చునని తెలిపారు. సీటీబీ.విజెడ్ఏఎస్ఈఆర్ అట్‌ది రేట్ ఆఫ్ జీమెయిల్.కామ్‌లో గానీ, విజయవాడ డీఆర్ఎం కార్యాలయం ప్రజాసంబంధాల అధికారి కార్యాలయం, గాంధీనగర్ విజయవాడకు గానీ వివరాలను పంపాలన్నారు. కాఫీ టేబుల్ బుక్ డిజిటల్ ఫార్మాట్‌లో ఉంటుందని, వంతెనలు, బ్రిడ్జిల కథలు, విజువల్స్, వాటియొక్క వారసత్వం, చారిత్రక కథనాలు రాబోయేతరాలకు అందుబాటులో ఉండేందుకు భద్రపరుస్తామని తెలిపారు. హేవలాక్ వంతెన, గోదావరి వంతెన, కృష్ణానదిపై వంతెన, పెన్నానదిపై వంతెన వంటి చారిత్రాత్మక, అద్భుత నిర్మాణాలకు ప్రతీకగా విజయవాడ రైల్వే డివిజన్‌లో 225 బ్రిడ్జిలు, వంతెనలు ఉన్నాయన్నారు. వీటిలో ఇంజనీరింగ్ అద్భుతాలే కాకుండా, సాంస్కృతిక, చారిత్రాత్మక ప్రాముఖ్యత కూడా ఉందన్నారు. భారతీయ రైల్వే ప్రగతికి నిశ్శబ్ద సాక్షులుగా ఇవి ఉన్నాయని నుస్రత్ ఎం. మండ్రూపకర్ వివరించారు. విజయవాడ డివిజన్‌లోని ప్రయాణికులు, విద్యార్థులు, రైల్వే ఔత్సాహికులు, చరిత్రకారులు, మీడియా నిపుణులు, ఈ 'కాఫీ టేబుల్ బుక్'ను రూపొందించేందుకు సహకరించాలని కోరారు. చరిత్రను ప్రత్యక్షంగా చూసిన వృద్ధుల వ్యక్తిగత కథనాలు, హైరిజల్యూషన్ ఛాయాచిత్రాలు, అరుదైన వాస్తవ కథనాలు పంపించవచ్చునని, పాఠశాల విద్యార్థులు, కవితలు, డ్రాయింగ్‌లు, కథలు, వారి అనుభవాలు, లేదా ఊహలను హైలెట్ చేయవచ్చునని తెలిపారు.

ఒకటో తరగతికి దరఖాస్తుల ఆహ్వానం

- బలహీనవర్గాల పిల్లలకు ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25శాతం సీట్లు
- 28 నుంచి మే15 వరకు స్వీకరణ
- సమగ్ర శిక్ష డైరెక్టర్ శ్రీనివాసరావు వెల్లడి

బెంజిసర్కిల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలోని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొనే పిల్లలు, బలహీన వర్గాల పిల్లల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఏపీ సమగ్ర శిక్షా రాష్ట్ర పథక డైరెక్టర్ బి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదేళ్ల వయస్సు నిండిన పిల్లలు ఈనెల 28 నుంచి మే15లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సంబంధిత గ్రామ సచివాలయం లేదా మండల విద్యావనరుల కేంద్రం లేదా సంబంధిత పాఠశాలల నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 1.44 లక్షలు మించరాదన్నారు. వివరాల కోసం టోల్‌ఫ్రీ నెంబరు 18004258599లో సంప్రదించాలని శ్రీనివాసరావు కోరారు.

స్వయం ఉపాధిపై అవగాహన పెంచాలి

- విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఉద్యోగ, స్వయం ఉపాధి రంగాలపై అవగాహనతో పాటు క్రీడాస్ఫూర్తిని పెంచాలని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. గురువారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో పంచాయతీ చాంపియన్స్, మండల సమాఖ్య అధ్యక్షులకు ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై గ్రామీణాభివృద్ధి, స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ, సీడాప్, ఎంప్లాయిమెంట్ విభాగాలకు చెందిన జిల్లా అధికారులతో పాటు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరాతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, కుటుంబంలో ఒక వ్యాపారవేత్త ఉండాలనేదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమన్నారు. ఈ దిశగా మండల సమాఖ్య అధ్యక్షులతో సమన్వయం చేసుకుంటూ పంచాయతీ చాంపియన్స్ ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. యువతకు ప్రభుత్వం నిర్వహించే జాబ్ మేళా వివరాలను తెలియజేయాలన్నారు. యువత చెడు మార్గాలు పట్టకుండా గ్రామాల్లో క్రీడలను అభివృద్ధి చేయాలన్నారు. ఎన్టీఆర్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్, ఎన్ఐఆర్‌డి ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసర్ ఎ.ఎన్.వి. నాంచారావు మాట్లాడుతూ, పంచాయతీ చాంపియన్స్ ద్వారా వచ్చే స్వయం సహాయక సంఘాలకు కావాల్సిన లోన్లు విషయం పరిశీలిస్తామన్నారు. సీడాప్ జేడీఎం (జాబ్స్ డిస్ట్రిక్ మేనేజర్) సుమలత మాట్లాడుతూ, ఎన్టీఆర్ జిల్లాలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన కార్యక్రమం కింద శిక్షణ, ఉపాధి అవకాశాలను వివరించారు. సీడాప్ ద్వారా బీఎస్సీ నర్సింగ్ యువతకు శిక్షణ ఇచ్చి జర్మనీ పంపిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాసరావు, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ మేనేజర్ జనార్ధనరావు, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వై.ఎన్.బ్రహ్మం, ఎన్టీఆర్ జిల్లా ఎన్ఐఆర్‌డి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్స్ జి.వి.నరసింహారావు, సొంగా సంజయవర్మలతో పాటు డ్వాక్రా సంఘాల మండల సమాఖ్య అధ్యక్షులు, పంచాయతీ చాంపియన్స్ పాల్గొన్నారు.

మాయలేడీలు

(5వ పేజీ తరువాయి)

లక్ష్మి కనిపించడం మానేసింది. తర్వాత గుట్టుచప్పుడు కాకుండా కంపెనీని మూసేసింది.

డాక్యుమెంట్ల చోరీకి వెళ్లి బంగారం దోపిడీ

లక్ష్మి రాసిచ్చిన ప్రామిసరీ నోట్లను సంబంధిత వ్యక్తుల ఇళ్ల నుంచి దొంగిలించే బాధ్యతను పావని నిర్వర్తిస్తుంది. ఆమె ఇచ్చిన స్కెచ్‌తో పావని అప్పు ఇచ్చిన రాజవర్ధనరావు ఇంటికి వెళ్లి మాట్లాడింది. ప్రామిసరీ నోట్లను ఆయన ఎక్కడ పెడుతున్నాడో పావని అడిగి తెలుసుకుంది. తర్వాత ఆయనకు అనుమానం రావడంతో ఆ డాక్యుమెంట్లను మరోచోటకు మార్చాడు. ఆయన కుటుంబంతో బయటకు వెళ్లేటప్పుడు తాళం ఎక్కడ పెడతారో పావని గుర్తించింది. ఇంట్లో కుటుంబం లేదని తెలుసుకున్న పావని తాళం తీసుకుని లోపలి ప్రవేశించింది. లోపల డాక్యుమెంట్లు దొరక్కపోయేసరికి పది కిలోల వెండి, బంగారు ఆభరణాలను దొంగిలించింది. ఆభరణాలు కనిపించకపోవడంతో ఆయనకు పావనిపై అనుమానం వచ్చింది. మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి సీసీఎస్‌కు బదిలీ చేశారు. పావని పాత్ర తేలడంతో ఆమెను అరెస్టు చేశారు. పెట్టుబడుల పేరుతో వసూలు చేసిన డబ్బుతో లక్ష్మి గ్యాంగ్ విశాఖకు పారిపోయినట్టు తెలిసింది. చోరీ కేసులో పావని పాత్ర తేలినప్పటికీ అరెస్టు చేయడానికి పోలీసులకు చాలారోజులు పట్టింది. దీని వెనుక ఓ టీడీపీ నాయకుడి ఒత్తిడి ఉన్నట్టు తెలిసింది. పావనిపై 2019 చోరీ కేసులు ఉన్నాయి. మూడు కేసులు పటమట పోలీస్‌స్టేషన్‌లో, ఒక కేసు మాచవరం పోలీస్‌స్టేషన్‌లో నమోదయ్యాయి. ఇప్పటి వరకు పావనీని పోలీసులు ఏ కేసులోనూ అరెస్టు చేయలేదు. తాజాగా రాజవర్ధనరావు ఇంట్లో జరిగి చోరీ కేసులో మాత్రం అరెస్టు చేశారు.

ఫిట్‌నెస్‌పై అనుమానాలు!

(5వ పేజీ తరువాయి)

కొంత కాలంగా రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు కూడా నిర్వహించటం లేదు. బస్సులో అగ్ని ప్రమాదం సంభవిస్తే కనీసం ఫైర్ ఎగ్జింజషర్లు కూడా లేవని తెలుస్తోంది. ప్రైవేటు బస్సులను తరచూ తనిఖీ చేయకపోవటంతో నిబంధనలకు విరుద్ధంగా చాలా మంది ఆపరేటర్లు వ్యవహరిస్తున్నారు. ప్రైవేట్ బస్సులను బస్టాండ్ ఎదురుగా నిలపకూడదని స్పష్టమైన నిబంధనలు ఉన్నా ఇక్కడే నిలుపుదల చేస్తున్నారు. రవాణా శాఖ అధికారుల కనీస తనిఖీలు కూడా లేకపోవటంతో ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు పేట్రేగిపోతున్నారు. బస్టాండ్ అవుట్ గేట్, రాజీవ్‌గాంధీ పార్కు దగ్గర నిలిపి ఉంచి ఆర్టీసీ ప్రయాణికులను ఎక్కించుకెళ్తారు. ఈ బస్సుకు హైదరాబాద్ నుంచి విజయవాడకు వచ్చే వారి తాకిడి ఎక్కువ. తక్కువ ధరకు ఆర్టీసీ ప్రయాణికులను తీసుకువెళుతుంటారని సమాచారం. హైదరాబాద్ నుంచి వచ్చేటపుడు మాత్రం నూరు శాతం ఆక్యుపెన్సీతో ఈ బస్సు విజయవాడ వస్తుంది. ప్రయాణికులు ఎక్కిన తర్వాత జరిగి ఉంటే మాత్రం ఘోర ప్రమాదం జరిగి ఉండేది.

నిద్దరోతున్న నిఘా!

(5వ పేజీ తరువాయి)

పైకి వచ్చే వాహనాల ట్రాఫిక్‌ను నియంత్రించడమే చేస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఓం మలుపు వద్ద బారికేడ్లు అమర్చి ఉంటాయి. ఇక్కడి నుంచి ఏ కేటగిరీకి సంబంధించిన కార్లను సమాచార కేంద్రం వరకు పంపాలో తెలుసుకునే పనిలోనే సెక్యూరిటీ సిబ్బంది ఉంటారు. కారులో బంగారు ఆభరణాలు చోరీ అయిన ప్రదేశంలో సెక్యూరిటీ ఉన్నప్పటికీ తానేమి చూడలేదని పోలీసులకు చెప్పినట్టు తెలిసింది.

తాజా చోరీపై అనుమానాలు

కొండపై జరిగిన చోరీపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాధితులు చెబుతున్న కథనం ప్రకారం 30 సెకన్ల వ్యవధిలో బంగారు ఆభరణాలు మాయమైనట్టు పోలీసులు భావిస్తున్నారు. కారుకు వేసిన లాక్‌లు వేసినట్టే ఉన్నాయి. ఎక్కడా అద్దాలు పగలుగొట్టిన దాఖలాలు లేవు. కారుకు ఎక్కడా గీతలు పడిన చాయలు లేవు. బాధితులు మాత్రం వస్తువులు ఇక్కడే కనిపించడం లేదని బలంగా చెబుతున్నారు.

సందిగ్ధం!

(5వ పేజీ తరువాయి)

చేస్తున్నారో విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి ఒప్పించే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో తమ గ్రామంలోనే పాఠశాల ఉండాలని తల్లిదండ్రులు పట్టుబట్టారు. వేరే పాఠశాలలో విలీనం చేయవద్దని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం డీఈవో, కలెక్టర్‌ను ఆయా గ్రామాలకు పంపి ప్రభుత్వం విద్యావ్యవస్థలో చేపట్టిన విధానాలను వివరించి పాఠశాలల్లో జరిగే మార్పులు, చేర్పులకు సహకరించాలని కోరారు. పామర్రు మండలం అరండల్‌పేట, కొత్తపేట, తూర్పుబడి, గుడివాడ రోడ్డులోని బాలుర పాఠశాల, పెదమద్దాలి తదితర పాఠశాలలకు కలెక్టర్, డీఈవో వెళ్లి పాఠశాలలను దగ్గరలోని పాఠశాలల్లో విలీనం చేస్తున్నామని సహకరించాలని కోరారు. అయితే తల్లిదండ్రులు తమ గ్రామంలోనే పాఠశాలలను కొనసాగించాలని, దూరంగా ఉన్న పాఠశాలలకు పంపబోమని ఖరాకండిగా చెప్పారు. కలెక్టర్ పర్యటన తర్వాత విద్యాశాఖ అధికారులు పాఠశాల విద్యాకమిటీ సభ్యులపై ఒత్తిడి తెచ్చి పాఠశాలల విలీనానికి తాము అంగీకరిస్తున్నట్టు లేఖలు రాయించడానికి ప్రయత్నాలు చేస్తుండటం గమనార్హం.

ఉపాధ్యాయ సంఘ నేతలతో సమావేశాలు నిర్వహిస్తున్నా..

గత వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమావేశమయ్యేది కాదు. ఉపాధ్యాయులు లేవనెత్తిన సమస్యలను పట్టించుకునే పరిస్థితులు ఉండేవి కావు. ఇష్టానుసారంగా గత ప్రభుత్వం జీవోలు జారీ చేసేది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి శుక్రవారం ఉపాధ్యాయ సంఘాల నాయకులతో విద్యాశాఖ ఉన్నతాధికారులు సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయితే ఈ సమావేశాల్లో చర్చించిన అంశాలు కార్యరూపం దాల్చడం లేదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంటున్నారు. పాఠశాలల విలీనం, చేర్పులు, మార్పులపై కూడా ఇంకా స్పష్టత రావడం లేదని, దీంతో గందరగోళం నెలకొందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.1.65లక్షలు

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీల కానుకలను గురువారం లెక్కించారు. మూడు నెలలకు రూ.1,65,865 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వై.శ్రీనివాసరావు తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ అనురాధ పర్యవేక్షణలో నిర్వహించిన హుండీ లెక్కింపులో ఆలయ ట్రస్టీ కాకాని అరుణబాబు, తవ్వా పూర్ణ చంద్రరావు, అర్చకులు భజన సమాజం భక్తులు పాల్గొన్నారు.


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అర్చకులు, భక్తులు


పురుషోత్తపట్నంలో సీసీరోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

అంతర్గత రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం

గన్నవరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో అంతర్గత రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. పురుషోత్తపట్నంలో రూ.30 లక్షలు, ముస్తాబాదలో రూ.71 లక్షలు, మాదలవారిగూడెంలో రూ.43 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను గురువారం స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. నియోజకవర్గంలో ఇప్పటికే పలు గ్రామాల ప్రధాన రహదారులను, అంతర్గత రహదారులను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. గోతులమయంగా మారిన గన్నవరం-నూజివీడు రోడ్డును ఇప్పటికే అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పురుషోత్తపట్నం సర్పంచ్ మాదల రోహిణి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు గుమ్మడి వెంకట్రామయ్య, తుమ్మల లక్ష్మణరావు, మాదల సాంబశివరావు, కుంటముక్కల శివయ్య, ముస్తాబాద సర్పంచ్ వేము రాధాకృష్ణ, పాలడుగు మల్లిఖార్జునరావు, మేడేపల్లి రమ, కొసరాజు సాయిరాం, రామినీడు బసవపూర్ణయ్య, దొంతు చిన్న, పీఆర్ ఏఈ దాస్, పంచాయితీ కార్యదర్శులు ఆయా గ్రామాల కూటమి నేతలు పాల్గొన్నారు.

రూ.35లక్షలతో ఎనిమిది సీసీ రోడ్ల నిర్మాణం

హనుమాన్‌జంక్షన్ : రూ.35 లక్షలతో ఎనిమిది సీసీ రోడ్లు వేయడానికి బాపులపాడు గ్రామ పంచాయతీ పాలక వర్గం తీర్మానించినట్లు పంచాయతీ కార్యదర్శి పూర్ణేశ్వరి తెలిపారు. సర్పంచ్ సరిపల్లి కమలా బాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించినట్లు తెలిపారు. దీంతో పాటు రానున్న 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.20లక్షలు ఖర్చు పెట్టి కొన్ని సీసీ రోడ్లు వేయడానికి అంచనాలు రూపొందించాలని తీర్మానించినట్లు తెలిపారు. ఎంపీపీ వై.నగేష్, జడ్పీటీసీ సభ్యురాలు కె.గంగాభవాని, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సర్పంచ్ శ్రీదేవికి పీఆర్ కమిషనర్ అభినందన


పంచాయతీలకు నిధుల కేటాయింపుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన వరి శ్రీదేవి

గుణదల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీలకు నిధుల కేటాయింపు అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన రామవరప్పాడు పంచాయతీ సర్పంచ్ వరి శ్రీదేవిని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ అభినందించారు. 16వ ఆర్థిక సంఘం సమావేశం తిరుపతిలో గురువారం జరిగింది. సమావేశానికి 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద పనగారియా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో పాల్గొనేందుకు రాష్ట్రం వ్యాప్తంగా తొమ్మిది మంది సర్పంచ్‌లను పంచాయతీరాజ్‌శాఖ ఎంపిక చేసింది. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచి ప్రాతినిధ్యం వహించేందుకు రామవరప్పాడు సర్పంచ్ వరి శ్రీదేవిని ఎంపిక చేసి ఆహ్వానం పంపడంతో ఆమె సమావేశానికి హాజరయ్యారు. మొదటగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన శ్రీదేవి పంచాయతీలకు జనాబా దామాషా ప్రకారం రూ.3600 చొప్పున కేటాయిస్తేనే పంచాయతీల మనుగడ సాధ్యమన్నారు. పవర్‌పాయింట్ ప్రజంటేషన్ విపులంగా ఉండటంతో పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ రామవరప్పాడు సర్పంచ్ శ్రీదేవిని ప్రత్యేకంగా అభినందించారు.


గన్నవరం ఆర్టీసీ డిపోలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు


ఉయ్యూరు డిపోలో పీటీడీ ఉద్యోగుల ప్లకార్డుల ప్రదర్శన

జగదల్‌పూర్ డ్యూటీకి మూడు మస్తర్లు ఇవ్వాలి

గన్నవరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జగదల్‌పూర్ డ్యూటీ చేస్తే మూడు మస్తర్లు ఇవ్వాలని ఏపీపీటీడీ ఎన్ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు బి.నాగిరెడ్డి డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ గ్యారేజ్ వద్ద గురువారం నిరసన తెలిపారు. నాగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యమ కార్యచరణలో భాగంగా ప్లకార్డులతో తమ సమస్యలను తెలియజేశామన్నారు. మహిళలకు 241 రూట్ బీట్ కేటాయించాలన్నారు. అక్రమ సస్పెన్షన్‌లు, రిమూవల్స్ ఆపాలన్నారు. గత నాలుగేళ్లుగా నిలిచిపోయిన ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలన్నారు. గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవు మంజూరు చేయాలన్నారు. మెడికల్ లీవ్‌లో ఉన్న ఉద్యోగులకు పూర్తి జీతం చెల్లించాలన్నారు. ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం, సంస్థ ద్వారా కొనుగోలు చేయాలన్నారు. 114జీవో ప్రకారం నైట్ అవుట్ అలవెన్స్‌లను రూ.150 నుంచి రూ.400 వరకు పెంచి ఇవ్వాలన్నారు. తీవ్రమైన అనారోగ్య కారణాలతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీలను కేటాయించాలన్నారు. పారదర్శకమైన బదిలీలు చేపట్టాలన్నారు. డిపో అధ్యక్షుడు శ్రీనివాసరావు, గ్యారేజ్ కార్యదర్శి ఆంజనేయులు, రాజు, రెడ్డి, నాని, భాస్కర్, రామచంద్రరావు, జాన్‌బాబు, గిరిజ, వసుంధర, కుమారి పాల్గొన్నారు.

ఉయ్యూరు : నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేర సమస్యల పరి ష్కారం కోరుతూ ఉయ్యూరు ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో పీటీడీ ఉద్యోగులు గురువారం ప్లకా ర్డులు ప్రదర్శన నిర్వహించారు. అసోసియేషన్ డిపో కార్యదర్శి పీఎం కృష్ణ మాట్లాడు తూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ పిలుపుమేర ఉద్యమ కార్యాచరణలో భాగంగా డిమాండ్స్‌తో కూడిన ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించామన్నారు. ఉద్యో గుల అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్ ఆపాలని, ఉద్యోగుల అనారోగ్య సెలవులకు పూర్తిజీతం ఇవ్వాలని, గ్యారేజి ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించి ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్యవిధానం పునరుద్ధరించడంతో పాటు ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వం లేదా సంస్థ కొనుగోలుచేయాలని, ఉద్యోగ భద్రతా సర్క్యులర్ 1/2019 అమలు పరచాలన్నవి ప్రధాన డిమాండ్లుగా తెలిపారు. అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అవుల శ్రీని వాసరావు, జిల్లా కమిటీ మెంబరు డీకే రావు, వైస్ ఛైర్మన్ పిచ్చయ్య, అరుణోదయ, శివ పార్వతి, బీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం నేడు

ఉంగుటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో ఈనెల 19వ తేదీ శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పరదేశి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రస్ట్ ప్రాంగణంలో కామినేని ఆరోగ్యకేంద్రం వారి ఆధ్వర్యంలో జరిగే ఈశిబిరంలో గుండె, ఎముకలు, కీళ్లు, ఇతర సాధారణజబ్బులతో పాటు కంటి, పంటి పరీక్షలు, బీపీ, రాండమ్ షుగర్, ఈసీజీ, పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. శిబిరానికి వచ్చే వారికి మధ్యాహ్న భోజనం అందజేస్తామన్నారు. వివరాలకు 8500944844 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కొండా ప్రవీణకు అభినందనల వెల్లువ

కంకిపాడు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా కొండా ప్రవీణ్ పేరును కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో ఆయనకు అభినందనలు వెల్లువెత్తాయి. ఉయ్యూరులోని కొండా ప్రవీణ్ నివాసంలో గురువారం ఆయనను కంకిపాడు మండల టీడీపీ అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర, వణుకూరు విక్రం, బొర్రా వెంకట్, వడ్డాది శ్రీను, మంచిగంటి శంకరరావు, మధు, శ్రీనులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు.


మాట్లాడుతున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఈడీ బి.అర్జునరావు


అవగాహన కల్పిస్తున్న ఈవోపీఆర్డీ దిలీప్‌కుమార్

రాష్ట్రాన్ని పరిశుభ్రంగా మార్చడమే లక్ష్యం

గన్నవరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని పరిశుభ్రంగా మార్చడంలో గ్రామాలు పూర్తిగా సహకరించాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఈడీ బి.అర్జునరావు అన్నారు. సూరంపల్లి గ్రామంలో గురువారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులు పర్యటించారు. ఈడీ బి.అర్జునరావు మాట్లాడుతూ గ్రామాల్లో తప్పని సరిగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని చెప్పారు. సేకరించిన చెత్త నుంచి సంపదను సృష్టించాలని చెప్పారు. అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. స్వచ్ఛాంధ్ర సాధనకు కలసికట్టుగా ముందుకు సాగాలన్నారు. సర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీడీవో టి.స్వర్ణలత, ఈవోపీఆర్డీ భారతి, పంచాయితీ కార్యదర్శి టి.లక్ష్మణరావులు పాల్గొన్నారు.

ఉంగుటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను స్వచ్ఛంగా చెత్తరహితంగా తీర్చిదిద్దటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని ఈవోపీఆర్డీ వి.దిలీప్‌కుమార్ పిలుపునిచ్చారు. వేమండ, వేంపాడు గ్రామాల్లో గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. స్వచ్ఛతా హీ సేవా గ్రామాలుగా రెండవ విడతలో వేమండ, వేంపాడు గ్రామాలను ప్రభుత్వం ఎంపికచేయడంతో ఆయన ఆయాగ్రామాలను సందర్శించి తడి, పొడి చెత్తను వేర్వేరుగా విభజించటం, గ్రీన్ అంబాసిడర్స్‌కి అందించటంపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఓవర్‌హెడ్‌ట్యాంకులను ప్రతి 15రోజులకోసారి శుభ్రపరుస్తున్నారా లేదా అని ప్రజలను ఆరా తీశారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సభ్యత్వ కార్డులే కార్యకర్తకు గుర్తింపు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ పనిచేస్తుందని అధ్యక్షుడు బేతా శేషకుమార్ అన్నారు. ఆరుగొలనులో టీడీపీ కార్యకర్తలకు సభ్యత కార్డులను గురువారం అందజేశారు. రాష్ట్రాభివృద్ధితో పాటు పేదలకు సకాలంలో సంక్షేమపథకాలు అందజేయడం కూటమి ప్రభుత్వం వల్లే సాధ్యమవుతుందని, అందుకు ప్రజలు కూడా మద్దతు ఇవ్వాలని కోరారు. అనిల్, గండి కృష్ణ, సత్యం, పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి

పెనమలూరు : మున్సిపల్ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని సీఐటీయూ నాయకులు ఉప్పాడ త్రిమూర్తులు, సరళ కోరారు. మునిసిపల్ కార్మికులు తాడిగడప మునిసిపాలిటీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. డిమాండ్లను నెరవేర్చని పక్షంలో సమ్మెకు దిగే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.ఏడుకొండలు, రత్నకర్ణ, డేవిడ్‌రాజ్, బిక్షాలు,దుర్గారావుపాల్గొన్నారు.

సమష్టితత్వంతో ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ

● మిల్క్‌యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : పాడి రైతులు, ఉద్యోగులు, పాల సొసైటీ అధ్యక్షుల సమష్టితత్వంతోనే ప్రాజెక్ట్ కామధేనులో నిర్వహించిన శ్రీసీతారామ లక్షణ సమేత దాసాంజనేయస్వామి దేవస్థానం, విగ్రహ ప్రతిష్ఠ విజయవంతమైందని కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. వీరవల్లి ప్రాజెక్ట్ కామధేను (పాల ఫ్యాక్టరీ) ఆవరణలో గురువారం నిర్వహించిన సమావేశంలో ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల్లోని 1200 గ్రామాల నుంచి వేలాది వాహనాల్లో తరలి వచ్చిన సుమారు 23 వేల మందికి పైగా పాడిరైతులు, ఉద్యోగులు క్రమశిక్షణతో ప్రతిష్ఠామహోత్సవంలో పాల్గొని విజయవంతం చేశారన్నారు. కృష్ణామిల్క్ యూనియన్ అభివృద్ధికి సహకారం అందించిన లక్షా యాభై వేల పాడిరైతు కుటుంబాల సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తామని చలసాని అన్నారు.

ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ అవసరం

ఉంగుటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పిల్లల పోషకాహారం, ఆరోగ్య సంరక్షణపట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. ఏడో పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ గన్నవరంప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఉంగుటూరు స్త్రీశక్తిభవనం మీటింగ్ హాలులో గురువారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటుచేసుకోవడం తల్లీబిడ్డల ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో పి.వెంకటలక్ష్మి మాట్లాడుతూ పిల్లల్లో పోషకాహార లోపం తలెత్తకుండా తల్లిదండ్రులు సరైన సంరక్షణ పద్ధతులు పాటించాలన్నారు. అనంతరం గర్భిణులకు ఘనంగా సీమంతం నిర్వహించారు. ఐసీడీఎస్ సిబ్బంది ప్రదర్శించిన చిరుధాన్యపు వంటలను అతిథులు రుచిచూసి అభినందించారు. తహసీల్దార్ జాలాది విమలకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బి.పద్మాదేవి, ఎల్.దుర్గాదేవి, ఈవోపీఆర్డీ వి.దిలీప్ కుమార్, ఎంఈవో-2 జె.సాంబశివరావు, వెలుగు ఏపీఎం భూపతిరావు, సర్పంచ్ వరప్రసాద్‌లు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో టీడీపీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కలిసికట్టు గా కృషి చేయాలని నియోజకవర్గ పరిశీలకుడు వ్రాణం హరిబాబునాయుడు సూచించారు. బొమ్ములూరులో గురువారం నిర్వహించిన టీడీపీ సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యనారాయణప్రసాద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. పార్టీ అభ్యున్నతికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగే విధంగా అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యనారాయణప్రసాద్ తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు రాజేశ్వరరావు, కార్యదర్శి సురేష్, సర్పంచ్ విజయభాస్కర్, నితీష్‌కుమార్, పాల్గొన్నారు.

లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీపై అపోహలు విడనాడాలి

పెనమలూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : కంటి లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీపై అపోహలు విడనాడాలని ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ ప్రేరణాశెట్టి అన్నారు. తాడిగడపలోని ఆసుపత్రి ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీ అనేది లేజర్ సోర్స్ ఉపయోగించి కళ్లలోని కార్నియా ఒంపును సరిదిద్దడం ద్వారా రోగికి కళ్లద్దాల అవసరం లేకుండా పోతుందన్నారు. ఈ శస్త్ర చికిత్సను హ్రస్వదృష్టి, దూరదృష్టి లోపం, వక్రదృష్టిలను సరి చేయడానికి చేస్తామన్నారు. లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీలను కంటి నిర్దిష్ట అవసరాల ఆధారంగా నేత్రవైద్యులు సూచిస్తారన్నారు.

కాల్వల అధునికీకరణకు నిధులు మంజూరు చేయాలి

● ఆర్థిక సంఘం ఛైర్మన్ పనగారియాకు ఆళ్ల వినతి


వినతిపత్రం అందజేస్తున్న ఆళ్ల గోపాలకృష్ణ , కొమ్మారెడ్డి రాజేష్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ పరిధిలోని కుడి, ఎడమ కాలువల అధునికీకరణకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ భారత 16వ ఆర్థిక సంఘ ఛైర్మన్ డాక్టర్ అర్వింద్ పనగారియాకు ఎన్ఎస్పీ ఎల్సీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ వినతిపత్రం అందజేశారు. విజయవాడలో 16వ ఆర్థిక సంఘ ఛైర్మన్ డాక్టర్ అర్వింద్ పనగారియా బృందం ఆధ్వర్యంలో రాజకీయ ప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులతో బుధవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో సాగునీటి కాలువల అధునీకరణ కోసం పూర్తి వివరాలతో కూడిన వినతిపత్రం ఆళ్ల బృందం అందజేసింది. రంగన్నగూడెంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆళ్ల మాట్లాడుతూ నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలో ఉమ్మడి కృష్ణా, ఏలూరు జిల్లాలకు చెందిన గన్నవరం, నూజివీడు, తిరువూరు, జగ్గయ్యపేట, మైలవరం, తదితర నియోజకవర్గాల పరిధిలో 3.67లక్షల ఎకరాల ఆయుకట్టు, కుడి కాలువ పరిధిలో పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో 11.16 లక్షల ఎకరాల ఆయుకట్టు ఉందన్నారు. వీటికి 132టీఎంసీల నీటికేటాయింపు ఉందని తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల సాగునీటి కాలువలు పూడుకుపోయి నీటిపారుదల సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయిందన్నారు. ఈ కాలువల అధునీకరణకు రూ.2,425 కోట్ల నిధులు మంజూరు చేయాలని గతంలోనే 16వ ఆర్థిక సంఘానికి నివేదిక ఇచ్చామన్నారు. ప్రస్తుతం నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువల పరిధిలోని ఏడు జిల్లాల్లోని లక్షలాది ఎకరాలకు సాగునీరు, 737 గ్రామాలకు, 10 మున్సిపాలిటీలకు తాగునీరందించేందుకు నిధులు మంజూరు చేయాలని ఛైర్మన్ డాక్టర్ అర్వింద్ పసగారియా దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఆళ్ల తెలిపారు. డీసీ ఛైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, దేవినేని సత్యన్నారాయణ, కుడికాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి, ఎన్టీఆర్ జిల్లా డీసీ ఛైర్మన్లు కటారి కోటేశ్వరరావు, పామర్తి శ్రీనివాసరావు, ఏలూరు జిల్లాకు చెందిన డీసీ ఛైర్మన్ రాపర్ల బాలకృష్ణ, గుంటూరు జిల్లా డీసీ ఛైర్మన్ నలజర్ల రవి కుమార్, ప్రకాశంజిల్లా డీసీ ఛైర్మన్ నల్లూరి కృష్ణారావు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై విద్యార్థి దశ నుండే అవగాహన తప్పనిసరిగా కలిగిఉండాలని అగ్నిమాపకశాఖ అధికారి జి.ఆర్.మోహనరావు అన్నారు. వీరవల్లి వాణీ విద్యానికేతన్ ఆవరణలో గురువారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం, మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ నందిగం రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు దాత సహకారం

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : దివ్యాంగులకు సహకారం అందిస్తే వారు కూడా సమాజాభివృద్ధిలో భాగస్తులవుతారని అవిర్నేని హరనాథ్ అన్నారు. ఆశాజ్యోతి దివ్యాంగ పాఠశాలకు వేలేరుకు చెందిన అవిర్నేని హరనాథ్ రూ.10 వేల విరాళాన్ని నిర్వాహకులు మరీ దుస్వామికి గురువారం అందజేశారు. తన కుమార్తె మునునూరి వెంకట చందన, జస్వంత్‌దంపతుల కుమార్తె పుట్టినరోజు సందర్భంగా దివ్యాంగుల పాఠశాల అభివృద్ధికి విరాళం అందజేసినట్లు తెలిపారు.

కూటమికి రుణపడి ఉంటాం : గండేపూడి

గన్నవరం: ఎస్సీ ఉపవర్గీకరణకు క్యాబినెట్ ఆమోదం తెలపటం హర్షణీయమని తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి గండేపూడి నితీష్‌కుమార్ అన్నారు. టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను గతంలో చంద్రబాబు నాయుడు చేయడంతో వేలాది మంది మాదిగ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబుతోనే వర్గీకరణ సాధ్యమైందని తెలిపారు. సర్పంచ్‌లు కాటూరి వరప్రసాద్, కె.విజయభాస్కర్, బొకినాల కిరణ్, నిమ్మకూరి మహేష్, తిరివీధుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంకే స్కూల్ విద్యార్థులకు కరాటేలో బెల్టులు

ఉయ్యూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : శ్రీ ఎంకె ఇంగ్లీషుమీడియం హైస్కూల్ విద్యార్థులు 45 మంది కరాటే బెల్టు టెస్ట్‌లో పాల్గొని విజయం సాధించారు. టెస్ట్‌లో పాల్గొన్న 12 మంది ఎల్లో బెల్టు, 12 మంది ఆరెంజ్, 11 మంది గ్రీన్, ఆరు గురు బ్లూ, ఇద్దరు బ్రౌన్, మరో ఇద్దరు బ్లాక్ బెల్టులు సాధించారు. ఈస ందర్భంగా గురువారం స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఏపీ టెక్నికల్ డైరెక్టర్ ఎస్ వెంకటేశ్వరరావు, కరాటే కోచ్ వీవీఎస్ రామకృష్ణ, స్కూల్ డైరెక్టర్ ఎంకె బాబు అభి నందించారు.

ఆదిత్య బధిరలో నూరు శాతం ఉత్తీర్ణత

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో స్థానిక ఆదిత్య బధిర విద్యాలయం విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఆకుల వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు విద్యాలయం నుండి ఆరుగురు హాజరు కాగా అందరూ మంచి ఫలితాలతో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. గత 15ఏళ్లుగా పాఠశాల నుంచి ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ అన్నపూర్ణ, ఉపాధ్యాయులు , సిబ్బంది అభినందించారు.



రాశుల్లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

రైతులకు అండగా నిలిచిన ప్రభుత్వమిది

- ధాన్యం కొనుగోలులో దళారుల ప్రమేయం లేకుండా చేశాం: మంత్రి నాదెండ్ల మనోహర్

కంకిపాడు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతులకు మేలు చేసేందుకు కొత్త ఆలోచనా విధానాలతో ముందుకు వెళతోందని, దళారులతో ప్రమేయం లేకుండా రైతులకు అండగా నిలిచిందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మండలంలోని పునాదిపాడు రైతు సేవా కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ధాన్యం రాశులను రైతులు, అధికార యంత్రాంగంతో కలిసి పరిశీలించారు. దాళ్వాలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే పద్ధతి లేకపోయినా 38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. రూ.8600 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. అనుకున్న దానికంటే వరి దిగుబడి ఎక్కువ కావడంతో గోనె సంచులు తక్కువ అయ్యాయని రైతులు చెబుతున్నారని, అవసరమైన సంచులు సరఫరా చేయాలని డీఈఎస్ఎం పద్మాదేవిని ఆదేశించారు. అనంతరం దావులూరులోని బాలాజీ మిల్లులో ధాన్యం దిగుమతిపై ఆరా తీశారు. రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని యాజమాన్యాన్ని హెచ్చరించారు. తర్వాత వణుకూరు రైతుసేవా కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి, తహసీల్దార్ భవన్నారాయణ, జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య, తెలుగురైతు జిల్లా కార్యదర్శి మద్దాలి సాయిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర, జనసేన జిల్లా ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ పులి కామేశ్వరరావు పాల్గొన్నారు.

24 గంటల్లోనే నగదు జమ చేసిందీ ప్రభుత్వం

- మంత్రి నాదెండ్ల వద్ద రైతుల సంతోషం

ఖరీఫ్‌తో పాటు దాళ్వాలోనూ ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే ఖాతాల్లో కూటమి ప్రభుత్వం నగదు జమ చేసిందని రైతులు మంత్రి నాదెండ్ల మనోహర్ వద్ద ఆనందం వ్యక్తం చేశారు. మునుపెన్నడూ లేనివిధంగా రూ.1600 మద్దతు లభించిందని తెలిపారు. హమాలీలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు



వల్లూరుపాలెం స్టాకుయార్డును సందర్శిస్తున్న మైనింగ్‌శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ కొండారెడ్డి, తహసీల్దార్ కుసుమకుమారి

ప్రతి స్టాకుయార్డులో 20 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ చేయండి

- కాంట్రాక్టర్లకు అధికారుల ఆదేశం

తోట్లవల్లూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో కృష్ణానదికి వరదలు వస్తే వినియోగదారులకు ఇసుక కొరత ఏర్పడకుండా స్టాక్ యార్డుల్లో భారీగా ఇసుక నిల్వ చేయాలని కాంట్రాక్టర్లను జిల్లా మైనింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కొండారెడ్డి ఆదేశించారు. వల్లూరుపాలెం, రొయ్యూరు ఇసుక స్టాక్‌యార్డులను కొండారెడ్డి, తహసీల్దార్ ఎం.కుసుమకుమారి, మైనింగ్‌శాఖ టెక్నికల్ అసిస్టెంట్ శంకర్ గురువారం సందర్శించి ఇసుక నిల్వలను పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న ఇసుక కాకుండా నేటి నుంచి క్వారీల గడువు(జూలై 14వ తేదీ) ముగిసేలోపు ఒక్కో స్టాక్ యార్డులో 20 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను నిల్వ చేయాలని అధికారులు సూచించారు. అలసత్వం వహించొద్దన్నారు.

విజయవాడ విమానాశ్రయ పనులను పూర్తి చేయండి

- అధికారులకు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ఆదేశాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): విజయవాడ విమానాశ్రయ విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, వచ్చే జూన్ నాటికి సిద్ధం చేయాలని విమానయాన అధికారులను కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు ఆదేశించారు. గురువారం ఢిల్లీలోని రాజీవ్ గాంధీ భవన్‌లో విజయవాడ విమానాశ్రయ ప్రాజెక్టు పనులపై అధికారులు, ప్రాజెక్టు భాగస్వాములతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. విమానయాన ప్రాజెక్టు పనుల పురోగతిపై ఆరా తీసిన మంత్రి పనులు పూర్తి కావడంలో జరుగుతున్న జాప్యం పట్ల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విస్తరణ పనుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని, మే నెలాఖరులోగా పనులను పూర్తి చేసి, జూన్ నాటికి విమానాశ్రయాన్ని సిద్ధం చేయాలని సూచించారు. ప్రాజెక్టు పనులను సకాలంలో పూర్తి చేస్తే ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మెరుగైన కనెక్టివిటీ సమకూరుతుందని సూచించారు. ఈ సమావేశంలో పౌర విమానయాన కార్యదర్శి వుయల్నామ్, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) చైర్మన్ విపిన్‌కుమార్, ప్రాజెక్టు భాగస్వాములు పాల్గొన్నారు.

ఉల్లి ధరలు తగ్గకుండా చర్యలు చేపట్టాలి

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

వన్‌టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉల్లి ధరలు అకస్మాత్తుగా పడిపోతున్న దృష్ట్యా ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టి ఉల్లి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కె.వి.వి.ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల క్వింటా ఉల్లి రూ.1,800 నుంచి రూ.2,300 వరకు పలికిందని, ప్రస్తుతం రూ.1,300కు పడిపోవటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. కనిష్ఠంగా క్వింటా ధర రూ.600కు పడిపోయిందని, రైతుకు కిలో ఉల్లికి రూ.ఆరు దక్కుతుంటే మార్కెట్‌లో రూ.20కు పైగా అమ్ముతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ఉల్లి ధరలు పడిపోకుండా రాష్ట్ర ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని, కిలో రూ.15 మద్దతు ధర ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో చిరుత మృతి ఘటనపై విచారణ

అమరావతి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో ఉచ్చులో చిక్కుకుని ఆడ చిరుత మృతి చెందిన ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమగ్ర విచారణకు ఆదేశించారు. గర్భంలోని రెండు కూనలు చనియాయని తెలుసుకున్న ఆయన ఐఎఫ్ఎస్ అధికారి చలపతిరావును విచారణాధికారిగా నియమించారు. ప్రాథమిక సమాచారాన్ని పరిశీలించి, అధికారులు ఎలా స్పందించారనే దానిపై ఆయన ఆరా తీశారు. అటవీ ప్రాంతాల్లో జంతువుల కోసం ఉచ్చులు పెట్టి, వేటగాళ్లు చేసే నేరాలపై నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. విచారణను అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు పర్యవేక్షించాలని సూచించారని ఉప ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు గురువారం తెలిపాయి.

ఆపరేషన్ బ్లాక్

కార్ల అద్దాల టింట్ ఫిల్మ్ తొలగింపు ● నగరంలో విస్తృతంగా ఎన్‌ఫోర్స్‌మెంట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

కారులో కూర్చున్న మనకు బయట రహదారులపై ఉన్న వాళ్లు కనిపించాలి. బయట ఉన్న వాళ్లకు మాత్రం కారు లోపల కూర్చున్న వారు కనిపించకూడదు. కార్ల యజమానుల ఆలోచన ఇది. దీని కోసం రెండు చేతులు అడ్డుగా పెట్టుకుని, అద్దాలపై ముఖం పెట్టి చూసినా కనిపించకుండా నలుపు రంగు ఫిల్మ్ అతికించారు. ఇప్పుడు ఈ నలుపు రంగు ఫిల్మ్‌ల తొలగింపునకు ట్రాఫిక్ పోలీసులు ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రారంభించారు. కార్లకు ఉన్న ఈ ఫిల్మ్‌లను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని పోలీసులు కొన్నాళ్ల క్రితం ప్రకటించారు. కమిషనరేట్ పరిధిలో హెల్మెట్ ధారణను తప్పనిసరి చేసిన సమయంలోనే ట్రాఫిక్ నిబంధనలకు సంబంధించిన స్పష్టమైన ప్రకటన చేశారు. ఒక్కో నిబంధనను ఉల్లంఘించిన వారికి ఎంతెంత జరిమానా విధిస్తారో ప్రకటించారు. హెల్మెట్‌పై ద్విచక్ర వాహనదారులు అవగాహనను పెంచుకున్నప్పటికీ కార్ల యజమానులు నలుపును తొలగించడానికి సుముఖత చూప డం లేదు. ఈ నలుపు రంగు ఫిల్మ్ తొలగింపునకు నిర్ణీత గడువు ఇచ్చినప్పటికీ యజమానుల్లో మార్పు రావడం లేదు.



బెంజ్‌సర్కిల్ వద్ద కారు అద్దాలకు ఉన్న నలుపు రంగు ఫిల్మ్‌ను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

70 శాతం విజిబులిటీ ఎక్కడ..

కార్ల అద్దాలకు ఉండే నలుపు రంగు ఫిల్మ్(టింట్ ఫిల్మ్) తొలగింపుపై సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. కార్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ నలుపు ఫిల్మ్ అతికించవద్దని పేర్కొంది. కార్లలో కూర్చున్న వారు, వాటిని నడిపే డ్రైవర్ బయటి వారికి కచ్చితంగా కనిపించాలని స్పష్టం చేసింది. ఒకవేళ ఈ ఫిల్మ్‌ను అతికించుకున్నప్పటికీ విజిబులిటీ 70శాతం ఉండాలని నిబంధన విధించింది. కానీ కార్ల యజమానులు ఈ నిబంధనను ఉల్లంఘిస్తున్నారు. లోపల ఉండేవారు కనిపించకుండా ఈ ఫిల్మ్‌లను అతికిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు నలుపును తొలగించాలని నిర్ణయించారు. ఈ టింట్ ఫిల్మ్‌లను తొలగించడానికి ప్రత్యేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తున్నారు. కూడళ్లలో ట్రాఫిక్ రెడ్ సిగ్నల్ పడినప్పుడు నలుపు ఫిల్మ్ ఉన్న కార్లను గుర్తించి పక్కకు తీసుకొస్తున్నారు. కారులో డ్రైవర్ సీట్లో ఉన్న వారితో ఆ ఫిల్మ్‌లను తీయిస్తున్నారు.

పెదపులిపాక ఇసుక రోడ్డుకు మహిళ బలి

- భర్తతో కలిసి కరకట్ట మీదుగా తాడిగడప వస్తుండగా ప్రమాదం
- ఇసుకలో స్కిడ్ అయిన ద్విచక్రవాహనం.. పాఠశాల వ్యాను కింద పడి దుర్మరణం

పెనమలూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పెదపులిపాకలో ఇసుకతో నిండిపోయిన ప్రధాన రోడ్డు గురువారం ఒక మహిళను బలితీసుకొంది. వివరాల్లోకి వెళితే తాడిగడపకు చెందిన చిలుమూరి శ్రీనివాస్, శిరీష(38) భార్యాభర్తలు. శ్రీనివాస్ అవనిగడ్డలో సబ్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గురువారం తాడిగడప శ్రీనివాసనగర్ కట్ట వద్ద ఉన్న తమ ఇంటికి భార్యాభర్తలిద్దరూ మోటారు సైకిల్‌పై వస్తున్నారు. పెదపులిపాక గ్రామంలోని ప్రధాన రోడ్డుపైన ప్రయాణిస్తుండగా వెనుక నుంచి పాఠశాల వ్యాను వస్తోంది. వ్యానుకు దారిచ్చేందుకు శ్రీనివాస్ మోటారుసైకిల్‌ను రోడ్డుకు ఒక పక్కకు తీసుకెళ్లారు. ఇసుకలోకి వెళ్లిన మోటారుసైకిల్ టైరు స్కిడ్ అయింది. దీంతో శిరీష కింద పడిపోయింది. వెనుక నుంచి వ్యాను శిరీష తలపైకి ఎక్కడంతో తల నుజ్జయి అక్కడికక్కడే మృతి చెందింది. గ్రామస్థులు శిరీషను పక్కకు తీసి పాఠశాల వ్యానును ఆపి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇసుకతో నిండిపోయిన పెదపులిపాక ప్రధాన రోడ్డు

పెదపులిపాక ప్రధాన రోడ్డు టిప్పర్లు, ట్రాక్టర్లు తెస్తున్న ఇసుకతో నిండిపోయింది. బైక్‌లపై ప్రయాణించేవారు ఇబ్బంది పడుతున్నారు. వారం క్రితం కరకట్టపై టిప్పరు ఢీకొనడంతో ఒక వాహనదారుడు కొద్దిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. అదే రోజు మరొకరి బైక్ టైరు టిప్పరు కింద నలిగిపోయింది. ఇంతలోనే పాఠశాల వ్యాన్ కింద మహిళ దుర్మరణం చెందడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలోకి ఇసుక టిప్పర్లు, భారీ వాహనాలు రాకుండా గడ్డర్ ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదించినా ఫలితం లేదంటున్నారు.

స్టార్టప్‌లకు సరికొత్త ఊపు

- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో మారనున్న పారిశ్రామిక రంగ రూపురేఖలు
- విజయవాడలో స్పోక్ ప్రాంతీయ కేంద్రం అభివృద్ధికి ముమ్మర కసరత్తు: కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్)తో స్టార్టప్‌లు, ఆవిష్కరణలకు సరికొత్త ఊపు రానుందని, ఈ హబ్‌తో పారిశ్రామిక రంగం రూపురేఖలు సమూలంగా మారనున్నాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన టాటా ఇన్నోవేషన్ హబ్-స్పోక్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్(ఐటీఈ అండ్ సీ) ప్రత్యేక అధికారి దీప్తిరావుతో పాటు సమన్వయ శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. స్టార్టప్, ఆవిష్కరణల వ్యవస్థలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి అత్యుత్తమ విధానాలను అమలు చేయడంతో పాటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేయనుందని తెలిపారు. ఈ హబ్‌కు అనుసంధానంగా విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, అనంతపురంలో ప్రాంతీయ స్పోక్స్ కేంద్రాలను అభివృద్ధి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ మద్దతు, ప్రైవేటు నిర్వహణలో ఉండే ప్రధాన హబ్‌తో పాటు ప్రాంతీయ కేంద్రాలకు ప్రత్యేక బోర్డులు ఉంటాయని పేర్కొన్నారు. ప్రాంతీయ కేంద్రానికి ఒక ప్రమోటర్ ప్రెసిడెంట్‌గా, ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది సహ ప్రమోటర్లు, ఇద్దరు స్వతంత్ర నిపుణులతో పాటు ప్రభుత్వం, విద్యారంగం, పారిశ్రామిక అసోసియేషన్ల నుంచి ఇద్దరు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఇందుకు ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ దరఖాస్తులు ఆహ్వానిస్తుందన్నారు. పెట్టుబడులు, ఫైనాన్సింగ్, ఇంక్యుబేషన్, భాగస్వాముల నిర్వహణ, అకౌంటింగ్, మార్కెటింగ్, కమ్యూనికేషన్ వంటి విధులను బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ నిర్వహిస్తుందని వివరించారు. విజయవాడ ప్రాంతీయ స్పోక్ కేంద్రం కార్యకలాపాల నిర్వహణకు శాశ్వత ప్రాంగణం అందుబాటులోకి వచ్చేంతవరకు తాత్కాలిక భవనంతో పాటు మౌలిక వసతులు కల్పించడం, కార్యకలాపాలు పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యేలా చూడటంపై దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో జిల్లాస్థాయి ఇన్నోవేషన్ టాస్క్‌ఫోర్స్ పని చేస్తుందని వివరించారు. వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ లక్ష్య సాధనకు, స్వర్ణాంధ్ర 2047ను సాకారం చేయడంలో విద్యాసంస్థలు, పారిశ్రామిక సంఘాలు భాగస్వాములవుతాయని సమావేశానికి హాజరైన ప్రతినిధులు స్పష్టం చేశారు. విట్ ఏపీ ప్రతినిధి డాక్టర్ అమీత్ చరణ్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రతినిధి ఉదయన్ బక్షి, మోహన్ స్పింటెక్స్ ప్రతినిధి వి.రమేష్, ఏపీఐఐసీ జడ్ఎం కె.బాబ్జి, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు

- వర్షాకాలంలోనూ ఇసుక కొరత రాకుండా జాగ్రత్తలు
- ఈ-వ్యర్థాల నిర్వహణ ఇతివృత్తంతో ఈనెల 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర': కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్: ఎన్టీఆర్ జిల్లాలో ఎక్కడా తాగునీటికి ఇబ్బంది లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన హాజరయ్యారు. వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా తీసుకొన్న చర్యలు, వచ్చే వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా ప్రస్తుతం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎంఎస్ఎంఈ సర్వే, అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు, పీఎం సూర్యఘర్, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల నిర్వహణపై సీఎస్ మార్గనిర్దేశం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. 'జిల్లాస్థాయిలో వేసవిలో తాగునీటి సరఫరా పర్యవేక్షణకు పటిష్ఠ వ్యవస్థ ఏర్పాటు చేశాం. ప్రజావసరాలు, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లాలోని ఇసుక స్టాక్ యార్డుల్లో 10 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలను సిద్ధం చేసి, ఇసుక కొరతకు తావు లేకుండా చూస్తాం. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు అవసరమైన భూమిని అందుబాటులోకి తెస్తాం. ఈ నెల మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఈ-వ్యర్థాల రీసైక్లింగ్ ప్రధాన అంశంతో నిర్వహిస్తాం. పర్యావరణ హిత ఈ-వ్యర్థాల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఈ-వ్యర్థాల సేకరణపై శిక్షణ ఇస్తాం.' అని సీఎస్‌కు కలెక్టర్ వివరించారు.

మహిళా న్యాయవాదుల డిష్యుం..డిష్యుం

విజయవాడ లీగల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బెజవాడ బార్‌లో ఇద్దరు మహిళా న్యాయవాదులు కలబడ్డారు. న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్న ఓ మహిళా న్యాయవాది, లా పూర్తి చేసి ఆల్ ఇండియా బార్ ఎగ్జామ్(ఏఐబీ) రాయకుండా వకల్తాలు వేస్తున్న మరో మహిళా న్యాయవాది మధ్య మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టు హాలులో మొదట వివాదం ప్రారంభమైంది. వకల్తాలు వేస్తున్న మహిళా న్యాయవాదిపై మరో మహిళా న్యాయవాది బెజవాడ బార్‌ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. దీంతో బార్ జనరల్ సెక్రటరీ ఏపీ రంగారావు వకల్తాలు వేసి ప్రాక్టీసు చేస్తున్న న్యాయవాదికి కబురుపంపారు. దీంతో బార్ చాంబర్‌కు వచ్చిన ఆమె, తనపై ఫిర్యాదు చేసిన న్యాయవాది పట్ల దురుసుగా ప్రవర్తించడంతో గొడవ ప్రారంభమైంది. ఇద్దరూ న్యాయవాదుల ముందే తన్నుకున్నారు. అనంతరం వకల్తాలు వేసే మహిళా న్యాయవాది, దుస్తులు చించేసుకొని రోడ్డుపైకి వెళ్లి బైఠాయించింది. విషయం తెలుసుకున్న సూర్యారావుపేట పోలీసులు రంగప్రవేశం చేసి ఆమెను స్టేషన్‌కు తీసుకెళ్లారు. దీంతో బార్‌లో ఫిర్యాదు చేసిన మహిళా న్యాయవాదితో పాటు పలువురు మహిళ, పురుష న్యాయవాదులు స్టేషన్‌కు వెళ్లి వకల్తాలు వేసి ప్రాక్టీసు చేస్తున్న న్యాయవాదిపై ఫిర్యాదులు చేశారు. అయితే వివాదాన్ని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి సామరస్యంగా పరిష్కరిస్తున్నట్లు సమాచారం.

వైసీపీ నేత, క్రికెట్ బుకీ అరెస్టు

సింగరాయకొండ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన వైసీపీ నేత, ప్రధాన క్రికెట్ బుకీ మసనం వెంకట్రావును పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్సై బి.మహేంద్ర తెలిపిన వివరాలు ప్రకారం.. వెంకట్రావు దగ్గర కడపకు చెందిన సతీశ్‌కుమార్ కొద్దినెలల నుంచి క్రికెట్ పందేలు ఆడుతున్నాడు. అతను ఇప్పటికే చాలా నగదు పోగొట్టుకున్నాడు. బెట్టింగ్‌లకు సంబంధించి ఇంకా రూ.2లక్షలు వెంకట్రావుకు చెల్లించాలి. ఈ నగదును వెంటనే ఇవ్వాలని తరచూ సతీశ్‌కుమార్‌ను వెంకట్రావు బెదిరింపులకు గురిచేస్తున్నాడు. వేధింపులు తట్టుకోలేక బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఏపీ గేమింగ్ యాక్ట్ 386 ఐపీసీ 3, 4 సెక్షన్ల కింద సింగరాయకొండ ఎస్సై మహేంద్ర కేసు నమోదు చేశారు. అనంతరం వెంకట్రావును అదుపులోకి తీసుకుని కందుకూరు కోర్టులో న్యాయాధికారి ఎదుట హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించడంతో నెల్లూరు జైలుకు తరలించారు.

ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం.. కౌలురైతు మృతి

కోడూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా కౌలురైతు మృతిచెందాడు. ఈ ఘటన కోడూరు శివారు నాయుడుపేటలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం..నాయుడుపేట గ్రామానికి చెందిన మల్లా నాగమల్లేశ్వరరావు(60) తాను కౌలుచేస్తున్న పొలంలో కూరగాయల పాదులు పెట్టుకోవాలనుకున్నాడు. ట్రాక్టర్‌తో రొటోవేటర్ వేసేందుకు బుధవారం కోడూరు గ్రామానికి చెందిన ప్రభువరప్రసాద్ ట్రాక్టర్ తీసుకెళ్లాడు. రొటోవేటర్‌లో మట్టిపట్టేయడంతో ఆ మట్టిని తీసేందుకు నాగమల్లేశ్వరరావు ప్రయత్నించాడు. అది డ్రైవర్ గమనించకపోవటంతో రొటోవేటర్‌లోకి నాగమల్లేశ్వరరావు రెండు కాళ్లు వెళ్లిపోయాయి. దీంతో ఒక కాలు అక్కడికక్కడే విరిగిపడిపోగా, మరో కాలు ఎముకలు బయటపడటం, నడుము వద్ద బలమైన గాయం కావటంతో వెంటనే అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే నాగమల్లేశ్వరరావు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గురువారం మృతుని భార్య మల్లా వెంకటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతుని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ఏసీబీకా.. సీఐడీకా!

- శాప్ ఇంజనీరింగ్ అధికారి కేసులో పోలీసుల ఆలోచన
- నిత్యం వివరాలు సేకరిస్తున్న రెండు విభాగాలు
- మహిళ పేరున ఉన్న భూముల వివరాలివ్వాలని రిజిస్ట్రార్‌కు లేఖ

విజయవాడ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): శాప్ ఇంజనీరింగ్ అధికారి కేసును ఏం చేద్దాం.. విజిలెన్స్‌కు ఇచ్చేద్దామా..ఏసీబీకి అప్పగిద్దామా? పోలీసుల ముందు ఉన్న ప్రశ్నలు ఇవి. శాప్‌లోని ఒక ఇంజనీరింగ్ అధికారికి, నందిగామలో ఒక మహిళకు మధ్య జరుగుతున్న ఆస్తుల వివాదం కేసులో కోట్లలో లావాదేవీలకు సంబంధించి వివరాలు వెలుగులోకి వస్తున్న విషయం తెలిసిందే. కొట్లాట కేసుగా నమోదు చేసిన పోలీసులు ఫిర్యాదురాలికి సంబంధించిన మొత్తం నగదు లావాదేవీలను గుర్తించారు. ఫిర్యాదు చేసిన మహిళ, ఆమె తల్లి పేరు మీద ఉన్న ఆరు బ్యాంకు ఖాతాల్లో రూ.9 కోట్లు ఉన్నట్టు ఇప్పటికే గుర్తించారు. ఎక్కడెక్కడ నుంచి ఏఏ మార్గాల్లో ఈ నిధులు వచ్చాయో తెలుసుకుంటున్నారు. అనంతపురం జిల్లాకు చెందిన కాంట్రాక్టర్ ఆమె ఖాతాకు రూ.2 కోట్లు బదిలీ చేసినట్టు మూడు రోజుల క్రితం నిర్ధారించారు. ఆ ఒక్క కాంట్రాక్టరే కాకుండా శ్రీకాకుళం, అమలాపురం, విజయవాడకు చెందిన కాంట్రాక్టర్లు ఆ మహిళ ఖాతాలకు డబ్బులు పంపినట్టు సమాచారం. తవ్వే కొద్దీ ఇందులో ఒక్కో మూలం బయటకు వస్తుండడంతో పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు మొత్తం కేసును క్షుణ్ణంగా దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారు. ఒకపక్క ఏసీబీ అధికారులు, మరో పక్క సీఐడీ అధికారులు ఈ కేసు గురించి పోలీసులను వివరాలు అడిగి తెలుసుకుంటున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ నేపథ్యంలో ఈ కేసులో ఇప్పటి వరకు సేకరించిన ఆధారాలను మొత్తం ఏసీబీకి గానీ, సీఐడీకి గానీ ఇచ్చేదామన్న యోచనలో పోలీసులు ఉన్నట్టు తెలుస్తోంది. ఇంజనీరింగ్ అధికారిపై ఫిర్యాదు చేసిన మహిళ పేరు మీద ఉన్న భూముల వివరాలను మొత్తం ఇవ్వాలని పోలీసులు రిజిస్ట్రేషన్ అధికారులకు లేఖలు రాశారు. అధికార పార్టీ నాయకులు పోలీసు అధికారులకు ఫోన్లు చేస్తున్నారు. నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు ఎవరెవరు తలదూర్చుతున్నారన్న వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు.

25 శాతం సీట్లలో రిజర్వు విద్యార్థులకు ప్రవేశాలు కల్పించండి

- ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలకు డీఈవో ఆదేశం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నిర్బంధ విద్యా హక్కు చట్టం కింద అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో రిజర్వు చేసిన విద్యార్థులకు 25 శాతం ప్రవేశాలు కల్పించాలని డీఈవో రామారావు ఆదేశించారు. అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధితుల పిల్లలు, దివ్యాంగులకు 5 శాతం, ఎస్సీలకు 10, ఎస్టీలకు 4, బలహీన వర్గాలకు 6 శాతం సీట్లు రిజర్వు చేయాలన్నారు. 1వ తరగతిలో ప్రవేశానికి సమ గ్ర శిక్ష విడుదల చేసిన వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఈనెల 28 నుంచి మే 15లోగా దరఖాస్తు చేసుకోవాలని, మే 20వ తేదీలోగా ఎంపిక చేస్తారని తెలిపారు. ఎంపిక చేసిన విద్యార్థుల లాటరీలు మే 21 నుంచి 24వరకు నిర్వహిస్తారన్నారు. మొ దటి జాబితాలో ఎంపికైన విద్యార్థులకు జూన్ 2న ప్రవేశాలు ఉంటాయన్నారు. 2వ జాబితా కోసం జూన్ 6న మళ్లీ లాటరీ నిర్వహిస్తారని, అందులో ఎంపికైన విద్యార్థులకు జూన్ 16న ప్రవేశాలు కల్పిస్తారని డీఈవో తెలిపారు.

చోరీ కేసుపై దుర్గగుడి ఈవో ఆరా

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తుల కారులో బంగారు ఆభరణాలు, నగదు చోరీ కేసుపై దుర్గగుడి ఈవో దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ గురువారం ఆరా తీశారు. మూడు రోజుల క్రితం అమ్మవారి దర్శనానికి వ చ్చిన హైదరాబాద్‌కు చెందిన ఆచంట దుర్గాప్రసాద్ ఘాట్ రోడ్డు ఓంకా రం మలుపు వద్ద పార్కింగ్ చేసిన కారులో 241 గ్రాముల బంగారు ఆభ రణాలు, రూ.10 వేలు చోరీ అయిన సంగతి విదితమే. చోరీ జరిగిన ప్రదేశం వద్దకు గురువారం ఈవో వెళ్లి పరిశీలించారు. అధికారులను, సెక్యూరిటీ గార్డులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెస్ట్ ఏసీపీ, డీసీపీలతో ఫోన్‌లో మాట్లాడి కేసు వివరాలు అడిగి తెలుసుకు న్నారు. అనంతరం ఆయన లిఫ్ట్ మార్గం నుంచి కాలినడకన వెళుతూ సీసీ కెమెరాలు ఉన్న ప్రదేశాలను పరిశీలించి సంబంధిత విభాగాల అధికా రులకు పలు సూచనలు చేశారు.

అదనపు కట్నం తెమ్మని వేధించిన ఐదుగురిపై కేసు

విద్యాధరపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పుట్టింటి నుంచి అదనంగా డబ్బులు తెమ్మంటూ భార్యను వేధించి, కొట్టి చంపుతానని బెదిరించిన భర్తతో సహా ఐదుగురిపై గురువారం భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. భవానీపురం కోళ్లఫారం రోడ్డుకు చెందిన యస్మినా బేగంకు 2017 మే 20న తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం, సింగరాయపాలెం గ్రామానికి చెందిన షేక్ అక్బర్‌తో వివాహమైంది. వివాహం సందర్భంగా యస్మినా బేగం కుటుంబ సభ్యులు అక్బర్ తల్లిదండ్రులకు రూ.5లక్షల కట్నం, 100 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.3లక్షల సామగ్రి కట్నంగా ఇచ్చారు. వివాహమైన రెండేళ్ల వరకు భార్యాభర్తలు బాగానే ఉన్నారు. 2018లో వీరికి కుమారుడు పుట్టాడు. అక్బర్ రోజూ మద్యం తాగి ఇంటికెళ్లి అకారణంగా భార్యను కొట్టేవాడు. ఇతర మహిళలతో తరచూ ఫోన్లు మాట్లాడుతుండేవాడు. దీనిపై అత్త, మామ, ఆడపడుచులకు చెప్పినా వారు అక్బర్‌కే మద్దతిచ్చేవారు. వీరందరూ అదనంగా రూ.5లక్షలు పుట్టింటి నుంచి తీసుకురమ్మని యస్మినా బేగంను వేధించి, ఓ గదిలో బంధించి కొట్టేవారు. భర్త, అతని కుటుంబ సభ్యుల వేధింపులు తాళలేక బాధితురాలు 2021లో పుట్టింటికి వచ్చి భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు అక్బర్, అతని కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి మళ్లీ కాపురానికి పంపించారు. 2023 అక్టోబరు 17న యస్మినా బేగం పాపకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి బాధితురాలిపై వేధింపులు మరీ ఎక్కువ అయ్యాయి. 2024 నవంబరు 10న అక్బర్ మద్యం తాగి ఇంటికివెళ్లి భార్యను విచక్షణారహితంగా కొట్టాడు. ఈ విసయాన్ని తండ్రి, సోదరుడికి బాధితురాలు చెప్పగా వారు అక్బర్, కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి ప్రశ్నించారు. వారిని కూడా కొట్టి ఇంటి నుంచి పంపించివేశారు. అక్కడి పోలీసులకు యస్మినా బేగం ఫోన్ చేయటంతో ఆమెను కూడా పంపించేశారు. దీంతో ఆమె పిల్లలను తీసుకుని పుట్టింటికి వచ్చింది. అదే నెల 29న అక్బర్, అతని సోదరి, సోదరి భర్త బాధితురాలి ఇంటికి వెళ్లి ఆమె కుమారుడిని బలవంతంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. పెద్దగా కేకలు వేయటంతో వారు అక్కడి నుంచి పరారయ్యారు. అప్పటి నుంచి అక్బర్ బాధితురాలికి అప్పుడప్పుడు ఫోన్ చేస్తూ చంపయినా కుమారుడిని తీసుకువెళతానని బెదిరిస్తున్నాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి, భర్త, అత్త, మామ, ఆడపడుచు, ఆమె భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250



నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

తడిచెత్త, పొడిచెత్త సేకరణ పరిశీలన

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందించాలని జిల్లా కలెక్టర్ డి.కె బాలాజీ పేర్కొన్నారు. వడ్లమన్నాడు శివారు రెడ్డిపాలెంలో గురువారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తడిచెత్త, పొడిచెత్త సేకరణ, చెత్త సంపద తయారీ కేంద్రం షెడ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గ్రామస్థులు పాల్గొన్నారు.



తడి, పొడిచెత్తలను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ



అగ్నిప్రమాద నివారణ పద్ధతులను వివరిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారులు

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం

గుడివాడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అగ్నిమాపకశాఖ కార్యాలయంలో గురువారం నాలుగవ రోజు విశ్వభారతి విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక పరికరాల ప్రదర్శనను తిలకించారు. అగ్ని ప్రమాదాలను ఎలా నియంత్రించాలో క్షేత్రస్థాయిలో చేసి చూపించారు. ప్రమాద సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, తప్పించుకునే మెళకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అవార్డులు

పామర్రు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన నిమ్మకూరు ఏపీఆర్‌జేసీ కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులను రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి నారాలోకేష్ చేతుల మీదగా షైనిక్ స్టార్ 2025 అవార్డులను అందుకున్నట్లు ప్రిన్సిపాల్ కె. గ్రేస్ సుభాషిని గురువారం విలేకరులకు తెలిపారు. ప్రభుత్వ ఏపీ రెసిడెన్షియల్ కళాశాలల్లో నిమ్మకూరు ఏపీఆర్‌జేసీ విద్యార్థుల్లో బైపీసీ విభాగంలో విశాఖ జిల్లా గాజువాకకు చెందిన నిరుపేద విద్యార్థిని డి.రేష్మ 990 మార్కులు సాధించింది. ఉమ్మడి గుంటూరుజిల్లా పల్నాడుకు చెందిన మరో పేద దివ్యాంగ విద్యార్థిని వి.కుసుమ లక్ష్మీకుమారి సీఈసీ విభాగం నుంచి 95శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. అనకాపల్లిజిల్లా కోటరాట్ల గ్రామానికి చెందిన వొకేషనల్ విభాగం పేద విద్యార్థిని ఎల్.కుసుమ రాణి 971మార్కులతో ప్రథమ స్థానం సాధించింది. ఎంపీసీ విభాగంలో వి.మణికంఠ 987 మార్కులతో మంచి ఉత్తీర్ణత సాధించాడు. విశాఖపట్నానికి చెందిన పీతా నిషా బైపీసీ విభాగంలో 940 మార్కులు సాధించింది. వనదుర్గా సీఈసీ నుంచి 949మార్కులతో ఉత్తీర్ణత సాధించి నిమ్మకూరు కళాశాలకు పేరు ప్రతిష్ఠను తీసుకొచ్చారన్నారు. సీనియర్ ఇంటర్‌లోఫలితాల్లో 96.26శాతం, జూనియర్ విభాగంలో 98శాతం ఫలితాలు తమ కళాశాల విద్యార్థులు సాధించారని సుభాషిణి తెలిపారు. రాష్ట్రస్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేసే షైనింగ్ స్టోర్స్‌లో మంత్రి లోకేష్ చేతుల మీదుగా బహుమతులు అందుకోవడం గర్వకారణమన్నారు. భవిష్యత్తులో విద్యాపరంగా మరింత అభివృద్ధిలో విద్యార్థులు ముందుకుసాగాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇతర అధ్యాపక సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



ఆరుగురు విద్యార్థులను షైనిక్ స్టార్లుగా సత్కరించిన మంత్రి లోకేష్

నవధాన్యాలు భూసారాన్ని పెంచుతాయి

● జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.పార్థసారధిరావు

పెదపారుపూడి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నవధాన్యాలను పొలంలో వేయటం వల్ల భూమికి భూసారం పెంచి మొక్కకు కావాల్సిన పోషకాలు అందుతాయని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.పార్థసారధి రావు పేర్కొన్నారు. పెదపారుపూడిలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట నవధాన్యాలు (పీఎండీఎస్) 32 రకాల విత్తనాలు స్థానిక రైతుల సమక్షంలో గురువారం తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలంలో నవధాన్యాలు వేయడం వల్ల కలుపు తగ్గుతుందన్నారు. దీంతోపాటుగా నీటి ఎద్దడి నుంచి ప్రధాన పంటలను సంరక్షించుకోవచ్చునని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ప్రాజెక్టు మేనేజర్ కె.నాగమల్లేశ్వరి, ఎన్ఎఫ్ఏ గంగరాజు, కృష్ణార్జున, డివిజన్ ఇంచార్జ్‌లు, యూనిట్ ఇంచార్జ్‌లు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.



32 రకాల విత్తనాలను చూపుతున్న అధికారులు, రైతులు

శాస్త్రీయ పద్ధతుల్లో సాగు సూత్రాలు పాటించాలి

● ఆంధ్రప్రదేశ్ సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ అథారిటీ కృష్ణా జిల్లా ప్రాజెక్టు ఇన్‌స్పెక్టర్ మహ్మద్ షరీఫ్

కూచిపూడి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అధికారులు నిర్దేశించిన శాస్త్రీయ పద్ధతుల్లో సాగు సూత్రాలు పాటిస్తే గ్యాప్ పొలం బడి ద్వారా రైతులు పండించిన ఉత్పత్తులకు స్కోప్ సర్టిఫికెట్ వస్తుందని ఆంధ్రప్రదేశ్ సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ అథారిటీ కృష్ణా జిల్లా ప్రాజెక్టు ఇన్‌స్పెక్టర్ మహ్మద్ షరీఫ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పెదనగల్లు గ్రామంలో మొవ్వ సాధికారిక ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ద్వారా వ్యవసాయశాఖ గురువారం నిర్వహించిన ఇండి గ్యాప్ పొలం బడి కార్యక్రమంలో రైతులనుద్దేశించి పలు సూచనలు చేశారు. రసాయన అవశేషాల రహితంగా పండించిన ఉత్పత్తులకు ఇండి గ్యాప్ స్కోప్ సర్టిఫికెట్ అందజేస్తుందన్నారు. ఆ సర్టిఫికెట్ ఉంటే మద్దతు ధర కన్నా రైతులు పండించిన ఉత్పత్తులకు మూడు రెట్లు ఎక్కువ ధరకు అమ్ముకోవచ్చునని తెలిపారు. సాధారణ సాగు కన్నా ఖర్చు తక్కువగా అవుతుందన్నారు. రైతులు పండించిన శాంపిల్స్‌ను బెంగుళూరులో గల ఫుడ్ క్వాలిటీ టెస్టింగ్ ప్రయోగశాలకు పురుగు మందుల అవశేషాల పరీక్షల నిమిత్తం పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ఎస్.శ్యామల, మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి ఏవోలు కె.శివ ప్రసాద్, మురళీకృష్ణ, సాయి సింధు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సమావేశంలో రైతులతో అధికారులు



గద్దె రామాంజనేయులు మృతదేహం



ముక్తినేని అంజలి మృతదేహం

మృత్యువులోనూ వీడని రక్తసంబంధం

గుడివాడ రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): దొండపాడుకు చెందిన గద్దె వెంకట రామాంజనేయులు (54) దొండపాడు స్వగృహంలో అంత్యక్రియలు గురువారం నిర్వహించారు. రామాంజనేయులు అక్క ముక్తినేని అంజలి మృతదేహానికి కూడా అంత్యక్రియలు దొండపాడు శ్మశాన వాటికలో జరిగాయి. గత మూడ్రోజుల క్రితం విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో రామాంజనేయులు మృతి చెందాడు. తమ్ముడి మరణవార్త విని తట్టుకోలేక ముక్తినేని అంజలి మరణించారు. గురువారం ఉదయం విజయవాడ నుంచి ఇద్దరి మృతదేహాలను తీసుకొచ్చి ఆయన స్వగృహంలో ఉంచారు. ఈయన భార్య గద్దె పుష్పరాణి ఎంపీపీగా పని చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, మాజీ మంత్రి పేర్ని నాని, వైసీపీ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, వివిధ మండలాల ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌డీలు, వివిధ శాఖల ఏఈలు, వివిధ శాఖల సిబ్బంది రామాంజనేయులు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వందలాది మంది వైసీపీ, టీడీపీ, గద్దె రాము అభిమానులు, బంధువులు అమెరికా నుంచి రాక వందలాది మందితో దొండపాడు గ్రామ పురవీధుల్లో శ్మశాన వాటిక వరకు ఊరేగించారు.

24న ధర్నాను జయప్రదం చేయాలి : రేపాని కొండ

గుడివాడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 24వ తేదీన కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నా ను జయప్రదం చేయాలని సంఘం పట్టణ కార్యదర్శి రేపాని కొండ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పంచవటి కాలనీలో ధర్నా కరపత్రాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. వడ్డెర వృత్తిదారుల సంఘం పట్టణ ఉపాధ్యక్షులు బండి శ్రీను, నాయకులు ఏడుకొండలు, కృష్ణ, జమలయ్య పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు



ధర్నా నిర్వహిస్తున్న ఎన్ఎంయూ యూనియన్ సభ్యులు

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

గుడివాడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ డిపోలోని సమస్యలు, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ రీజనల్ కార్యదర్శి కె.వి రావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఎన్ఎంయూ ఆధ్వర్యంలో యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసనధర్నా చేపట్టారు. యూనియన్ డిపో అధ్యక్షులు వాసు, కార్యదర్శి డి.ఎల్.ఎల్ మూర్తి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

భూసార పరిరక్షణపై అవగాహన తప్పనిసరి

● మండల వ్యవసాయాధికారి ఎన్.భాను ప్రకాష్

నందివాడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్ర పరిధిలో రైతులకు భూసార పరిరక్షణ ఆవశ్యకత పై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి ఎన్.భాను ప్రకాష్ పేర్కొన్నారు. జనార్ధనపురం సచివాలయం వద్ద గురువారం రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో కలసి వ్యవసాయ భూమిలోకి వెళ్లి మట్టిని తవ్వారు. అనంతరం తవ్వినమట్టిని మెత్తగా చేసి, పరీక్షా కేంద్రానికి తీసుకువెళ్లి పరిరక్షించాలన్నారు. ముఖ్యంగా రైతులు పచ్చిరొట్ట విత్తనాల వాడకం , పశువుల ఎరువుల వాడకం తగ్గించటం వల్ల భూమిలో సేంద్రీయ పదార్థం తక్కువై మొక్కకు ఉపయోగ పడే సూక్ష్మ జీవులు నశిస్తున్నాయన్నారు. రసాయనిక ఎరువులు కూడా అవసరమైన సిఫార్సు చేసిన మోతాదు వరకు వాడటమే మంచిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు సరిపల్లి ఉమా శంకర్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



జనార్ధనపురంలో మట్టి సేకరిస్తున్న ఎన్.భాను ప్రకాష్

సాయిబాబా మందిరంలో చోరీ

గుడివాడ రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రూరల్ పీఎస్ పరిధిలోని స్థానిక శ్రీదేవి నగర్‌లోని సాయిబాబా మందిరంలో 15వ తేదీన అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దొంగలు తాళాలు పగులకొట్టి ఒక వెండి కిరీటం, ఒక జత వెండి పాదుకలు, ఒక వెండి హారతి స్టాండ్, వెండితో చేసిన శఠగోపురం, ఒక వెండి ఉత్సవ విగ్రహం, ఒక జత దీపం స్తంభాలు, ఆలయ హుండీ నుంచి కొంత మొత్తంలో నగదు దొంగించారని ఎస్సై ఎన్.చంటిబాబు తెలిపారు. మొత్తం రూ.1.45 లక్షల విలువ ఉంటుందని నిర్వాహకులు సుంకర కోటేశ్వరరావు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వక్ఫ్ చట్ట సవరణ బిల్లును రద్దు చేయాలి

గుడివాడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ముస్లిం మైనార్టీల హక్కులను హరిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లు-2025ను వ్యతిరేకిస్తూ గుడివాడలో గురువారం ముస్లింలు కదం తొక్కారు. స్థానిక ముబారక్ సెంటర్ నుంచి ఆర్‌డీవో కార్యాలయం వరకు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. వక్ఫ్‌ను కాపాడాలని, రాజ్యాంగాన్ని రక్షించాలని కోరుతూ నినాదాలు చేశారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ఉన్న వక్ఫ్ చట్ట సవరణల బిల్లును వెంటనే రద్దు చేయాలని ఆరోపించారు. వక్ఫ్ చట్ట సవరణలను రద్దు చేసే వరకు పోరాటం ఆగదని ముస్లిం జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. అనంతరం ఆర్‌డీవో కార్యాలయంలో ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేశారు. ర్యాలీకు స్థానిక పోలీసులు భద్రత కల్పించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.



గుడివాడలో నిరసన ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

గుడివాడలో రన్ ఫర్ జీసెస్ రేపు

గుడివాడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఈస్టర్ పండుగ సందర్భంగా ఈనెల 19వ తేదీన గుడివాడలో రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు బిషప్ అప్పికట్ల జాషువా తెలిపారు. గురువారం స్థానిక ఫుల్ గాస్పెల్ చర్చి ఆఫ్ ఇండియాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన రూట్ మ్యాప్ గురించి వివరించారు. శనివారం ఉదయం ఏలూరురోడ్డులోని ఆర్సీఎం చర్చి నుంచి నెహ్రూచౌక్ సెంటర్, మార్కెట్ సెంటర్‌ల మీదగా బస్టాండ్ ఎదురు రోడ్డులో ఉన్న ఫుల్ గాస్పెల్ చర్చి వరకు ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. అనంతరం అక్కడే ముగింపు సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కన్వీనర్ జి.శ్యాంబాబు, పాస్టర్లు కరుణసాగర్, జి.ఎ శేఖర్, నేలపాటి శ్యామ్యూల్, సునీల్ కుమార్, యేహెజ్కేలు, కరుణ కుమార్, ఏలీషా, సత్యం, నోవాహు, కోటేశ్వరరావు, సువార్త రాజు, విలియమ్, ఆల్ డినామినేషన్ సేవకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాస్టర్లు

దళితుల అభివృద్ధి కూటమితో సాధ్యం

పామర్రు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : దళితుల సంక్షేమాభివృద్ధి కూటమి ప్రభుత్వానికే సాధ్యమని మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు రుజువు చేశారని టీడీపీ బందరు పార్లమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి చాట్ల రమేష్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులకు ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు 4074ఆటోలను 50శాతం రాయితీతో తమ ప్రభుత్వామే అందిస్తోందన్నారు. అదేవిధంగా 2685మంది ఎస్సీ రైతులకు వ్యవసాయ పరికరాలను 50శాతం సబ్సిడీ ఇవ్వనున్నామన్నారు. ఈకార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

గుడివాడ : ఆల్ ఇండియా బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏఐబీఈఏ) వ్యవస్థాపకులు హెచ్.ఎల్ పర్వానా 50వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక భవిత కేంద్రంలోని చిన్నారులకు పరీక్ష అట్టలు, స్వీట్స్ పంపిణీ చేశారు. బ్యాంకు విశ్రాంత ఉద్యోగులు టీవీ సుబ్బారావు, పి.సీతారామారావు, ఎం.రమణమూర్తి, దేవేంద్రరావు, ప్రసాద్, భాస్కరరావు, నాగరాజు, బసవేశ్వరరావు, వెంకటరావు, కేంద్ర ఉపాధ్యాయులు ఎం.సీలాంబరం, షేక్ ఫాజిలా తదితరులు పాల్గొన్నారు.

గొడుగు వితరణ

గుడివాడ : అధిక ఉష్ణోగ్రతలతో ఇబ్బంది పడుతున్న సోడా వ్యాపారికి గుడివాడ జేసీస్ క్లబ్ ఆధ్వర్యంలో గొడుగును అందజేసినట్టు జేసీస్ పూర్వ అధ్యక్షులు తాడిపర్తి శ్రీనివాస్ తెలిపారు. గురువారం స్థానిక ఏలూరురోడ్డులోని పాత నవోదయ బుక్ స్టాల్ వద్ద సోడా బండి నిర్వాహకునికి గొడుగును అందజేశారు. క్లబ్ పూర్వఅధ్యక్షులు రూప్‌చంద్‌జైన్, కార్యదర్శి అన్నంస్వామి, తిరుమలశెట్టి హారిక, సాయికిరణ్ పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన ఉండాలి



మొవ్వలో పౌష్టికాహార ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ సిబ్బంది

గుడివాడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నాగవరప్పాడులోని అంగన్వాడీ కేంద్రాలు 2,3లలో పోషకాహార పక్షోత్సవాల సందర్భంగా గురువారం సీఎంఏఎంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో విజయఫ్లారెన్స్, సూపర్‌వైజర్ నాగజ్యోతి, టీడీపీ నాయకులు దాసు శ్యామ్‌ప్రసాద్, దుర్గారావు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

కూచిపూడి : పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మొవ్వ -3 అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు కిశోర బాలికలు, తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి వివరించారు. సూపర్‌వైజర్ పుణ్యవతి, అంగన్వాడీ కార్యకర్త నాగమల్లి, వీవో ఫణి తదితరులు పాల్గొన్నారు.



పోషణ్ పక్వాడాలో పాల్గొన్న పిల్లలు, గర్భిణులులు

నందివాడ : గర్భిణులు పౌష్టికాహారంతోపాటు మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలని గుడివాడ ప్రాజెక్టు అధికారిణి ఏ.విజయ ఫ్లోరెన్స్ అన్నారు. పౌష్టికాహార వారోత్సవాలలో భాగంగా పుట్టగుంట అంగన్వాడీ కేంద్రం వద్ద అంగన్వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో గురువారం పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1000 రోజులు సంరక్షణ, రక్తహీనత, వ్యక్తిగత పరిశుభ్రత, బిడ్డ పెరుగుదల పర్యవేక్షణ గురించి లబ్ధిదారులకు వివిధ సమస్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎన్.నాగశిరీష, అంగన్వాడీ కార్యకర్తలు మహాలక్ష్మి, తేజశ్రీ, రత్నకుమారి, ఆశా వర్కర్లు, గర్భిణులు పాల్గొన్నారు.

పామర్రు : పామర్రులోని కార్పెంటరీ కాలనీలో అంగన్వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహించారు. దీనిలో భాగంగా సూపర్‌వైజర్ ఎన్‌సత్యశ్రీ చిన్నారుల బరువులు, ఎత్తుగురించి తెలుసుకుని, బరువుతక్కుగా ఉన్న చిన్నారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పలువురు అంగన్వాడీ కేంద్రాల నిర్వహకులు పాల్గొన్నారు.

పెదపారుపూడి : జమిదింటకుర్రు అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సూపర్‌వైజర్ ఎం.శివనాగమణి హాజరయ్యారు. ఆహారంలో ప్రోటీన్లు, మినరల్స్, విటమిన్స్ కలిగిన ఆహారం తీసుకోవాలని తల్లులకు వివరించారు. చిన్న పిల్లల తల్లులకు, గర్భిణులకు అవగాహన కల్పించారు.అంగన్వాడీ ఉపాధ్యాయులు సుశీల, వైద్య సిబ్బంది, పిల్లలు, గర్భిణులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయ ఫ్లొరెన్స్

తోట్లవల్లూరు : ప్రతి మహిళ గర్భం దాల్చిన నాటి నుంచే పోషకాహారంపై దృష్టి సారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె నాగమల్లేశ్వరి సూచించారు. గరికపర్రు-2 అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఏఎన్ఎం కె లక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు. యాకమూరు-1 అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్వాడీడీ కార్యకర్త పి. మరియమ్మ, ఏఎన్ఎం భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ కె. నాగమల్లేశ్వరి

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420	



కేఈబీ కెనాల్‌లో విద్యార్థి గల్లంతు



గల్లంతైన పవన్ (ఫైల్)

ఘంటసాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కేఈబీ కెనాల్‌లో విద్యార్థి గల్లంతైన సంఘటన గురువారం సాయంత్రం పాపవినాశనం గ్రామ సమీపంలో జరిగింది. గ్రామానికి చెందిన పత్తిపాటి వెన్నెల బట్టలు ఉతుక్కునేందుకు సాయంత్రం కాలువ వద్దకు వెళ్లింది. ఆమె వెంట వచ్చిన కుమారుడు పవన్ (15) స్నానం చేసేందుకు కాల్వలోకి దిగాడు. నీటి ఒరవడి ఎక్కువగా ఉండటంతో పవన్ గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు గాలింపు చర్యలు చేపట్టారు. పవన్ శ్రీకాకుళం జడ్పీ పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాశాడు.



విశ్వనాథపల్లి పాఠశాలలో తరగతి గదుల పనులను పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష కో-ఆర్డినేటర్ ఫణి ధూర్జటి

తరగతి గది నిర్మాణ పనుల పరిశీలన

కోడూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : విశ్వనాథపల్లి పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఎం.ఫణి ధూర్జటి గురువారం పరిశీలించారు. గ్రామస్థుల అభ్యర్థన మేరకు పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారని, అయితే, తరగతి గదుల నిర్మాణం పూర్తయిన అనంతరమే హైస్కూల్ అనుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంఈవో-2 వి.శ్రీనివాసరావు, స్థానిక ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



దివ్యాంగ బాలలకు ట్రై సైకిళ్లు, వీల్‌చైర్లు అందిస్తున్న ఎమ్మెల్యే మండలి

దివ్యాంగ బాలల్లో ఆత్మవిశ్వాసం నింపాలి

అవనిగడ్డ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగ బాలల్లో ఆత్మవిశ్వాసం నింపాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో భవిత కేంద్రాల్లో శిక్షణ పొందుతున్న దివ్యాంగ బాలబాలికలకు వీల్ చైర్లు, ట్రై సైకిళ్లు, బ్యాటరీ వీల్ చైర్ల పంపిణీ చేశారు. సమగ్ర శిక్షణ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డి.ఫణి, ఎంపీపీ తుంగల సుమతిదేవి, ఎంఈవోలు శివ శంకర్, ఏ.పిచ్చియ్య, ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, ఆరు మండలాల ఎంఈవోలు, భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పొంతన లేని సమావేశం..మహిళల అయోమయం!

అవనిగడ్డ రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు స్వయం ఉపాధి లక్ష్యంగా కుట్టు శిక్షణా కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించనుంది. గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. దాదాపు 100 మందికిపైగా మహిళలు దరఖాస్తులు అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ తుంగల సుమతిదేవి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ఎందుకు నిర్వహిస్తున్నారు, ఎవరి తరఫున నిర్వహిస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఒక అధికారి తెలుపగా, డీఆర్డీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు మరో అధికారి చెప్పటం గమనార్హం. మహిళలు కుట్టు శిక్షణకు దరఖాస్తులు అందించటానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అధికారులు పొంతన లేని సమాధానం చెప్పటంతో ఏ శాఖ అయితే మాకెందుకు .. మాకు కుట్టు మిషన్లు ఇస్తే చాలని పలువురు మహిళలు వ్యాఖ్యానించారు.



విద్యార్థులు, అధ్యాపకులకు ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లల హేచరీ, సంరక్షణ గురించి వివరిస్తున్న మెరైన్ పోలీసులు

ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణపై అవగాహన

కోడూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ -1, 2, ఎకో క్లబ్, జంతు శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులు జీవ వైవిధ్యాన్ని పరిరక్షించటంలో బాగంగా పాలకాయితిప్ప వద్ద ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లల సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. తాబేళ్ల సంరక్షణ అధికారులు నాగరాజు, మెరైన్ పోలీసు అధికారులు రామకృష్ణ విద్యార్థులకు ఆలివ్ రిడ్లే తాబేలు సంతానోత్పత్తి విధానం, సంరక్షణ పద్ధతులు వివరించారు. వన్యప్రాణి సంరక్షణ ఆవశ్యకత, మడ అడవుల ప్రాధాన్యత తెలుసుకున్నారు. ప్రిన్సిపల్ ఉమారాణి, అధ్యాపకులు డి.రాజ్యలక్ష్మి, నాగార్జున, ముత్యాల వెంకటేశ్వరరావు, నాగమణి, ఎన్ఎస్ఎస్ పీవో డా.ఏ.వీరకుమారి, రవిబాబు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



దివి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన కొల్లూరి వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న కూటమి నేతలు

కొల్లూరి వెంకటేశ్వరరావుకు సత్కారం

అవనిగడ్డ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శినియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. దివి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన కొల్లూరి వెంకటేశ్వరరావును గురువారం కనపర్తి ఆధ్వర్యంలో ఆరు మండలాల నేత లు ఘనంగా సత్కరించారు. దివి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, సీడీసీ మాజీ చైర్మన్ రావి నాగేశ్వరరావు, టీడీపీ నేతలు పైడిపాముల కృష్ణకుమారి, బండే కనకదుర్గ, మోర్ల జయలక్ష్మి, దివి యుగంధరి, కర్రా సుధాకర్, మేడికొండ విజయ్, లకనం నాగాంజనేయులు, నాగిడి తాతారావు, మాచవరపు ఆదినారాయణ, నలుకుర్తి జనార్ధనరావు పాల్గొన్నారు. కార్యాలయంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మండలి వెంకట్రామ్ ఆధ్వర్యంలో కూటమి నేతల ఆధ్వర్యంలో కొల్లూరి దంపతులను ఘనంగా సత్కరించారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

అవనిగడ్డ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం అవనిగడ్డలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. మొత్తం 113 మంది పాల్గొనగా, 76 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలు పొందిన వారికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతులమీదుగా నియామకపత్రాలు అందజేశారు. జిల్లా ఉపాధి అధికారి డి.విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్ కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి, నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్లేస్‌మెంట్ అధికారి తుర్లపాటి మధు పాల్గొన్నారు.

శాంతి ప్రదర్శనను విజయవంతం చేయండి

చల్లపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ లెనిన్ సెంటరులో ఈనెల 22వ తేదీన జరిగే శాంతి ప్రదర్శనను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు సింగోతు నాగేంద్రరావు పిలుపునిచ్చారు. ఈమేరకు చల్లపల్లిలో శాంతి ర్యాలీ, ప్రచార సభ కరపత్రాలను ఆవిష్కరించి విలేకర్లతో మాట్లాడారు. నందేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన కల్వర్టు పనులు

అధికారుల అనాలోచిత చర్యలు, పనుల్లో జాప్యం, ముందు చూపుకొరవడిన కారణంగా ప్రజలు అవస్థల పాలౌతున్న సంఘటనకు ప్రత్యక్ష నిదర్శనమే దక్షిణ చిరువోలులంకకు వెళ్లే రహదారి పనులు.

- అధికారుల నిర్లక్ష్యం..కొరవడిన ముందుచూపు
- దక్షిణ చిరువోలులంక ప్రజలకు రహదారి కష్టాలు



కల్వర్టు నిర్మాణంతో మూసుకుపోయిన రహదారి

(ఆంధ్రజ్యోతి-అవనిగడ్డ రూరల్)

కరకట్టనుంచి దక్షిణ చిరువోలులంక వెళ్లే రహదారి మరమ్మతుల్లో భాగంగా 15 రోజుల క్రితం మార్గమధ్యంలో కల్వర్టు నిర్మాణం చేపట్టారు. ఈ మార్గంలో ప్రయాణానికి వీలులేకపోవడంతో అధికారులు ప్రత్యామ్నాయమార్గం ఏర్పాటు చేయలేదు. మరమ్మతులు చేపట్టి 15 రోజులు అవుతోంది. పూర్తి స్థాయిల పనులు చేపట్టలేదు. కేవలం కల్వర్టు నిర్మాణం చేపట్టిన అధికారులు పనులు నత్తన డకన చేస్తున్నారు. ఈ రహదారి నుంచి వెళ్లేందుకు వీలు లేకపోవడంతో దక్షిణ చిరువోలు లంక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అనుకోకుండా వాతావరణంలో మార్పులు వచ్చి వర్షాలు కురిస్తే ప్రక్కన ఉన్న మట్టి రోడ్డే గ్రామస్తులకు దిక్కు. వాహనాల రాకపోకలకు కూడా వీలుండదు. నడక దారి మాత్రమే. పనులు నత్తనడకన సాగుతుండడంతో 15 రోజులగా పాఠశాలలకు వెళ్లే పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఊళ్లోకి బస్సులు రాకపోవడంతో పిల్లల తల్లిదండ్రులు తమ రోజూ వారి కూలి పనులు మానుకుని దాదాపు రెండు కిలోమీటర్లు సైకిల్, మోటార్ వెహికల్ మీద తమ పిల్లలను మాచవరం కరకట్ట వరకు ఉదయం తీసుకువచ్చి మళ్లీ సాయంత్రం తీసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఏదయినా పని మీద తల్లిదండ్రులు రావటం కుదరకపోతే ఆ పిల్లలు 2 కిలోమీటర్లు నడవాల్సిందే. వారం రోజుల క్రితం స్టార్ట్ చేసిన అవనిగడ్డ - కోడూరు రోడ్డు దాదాపుగా ముగింపు దశలో ఉంది. ఈమార్గంలో 20 గజాల కల్వర్టుకి ఇంకా ఎన్ని రోజులు తీసుకుంటారోనని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదమరిచి ఎవరైనా కింద రోడ్డు ఉంది కదా అని వెళ్తే ఇంకా అంతే సంగతులు. ఎలాంటి ప్రమాద హెచ్చరికలు తెలిపే బోర్డులు పెట్టకపోవటంతో కాంట్రాక్టరు, అధికారుల నిర్లక్ష్యంపై ప్రజలు మండిపడుతున్నారు. రహదారిలో కల్వర్టు నిర్మాణ పనులు, రోడ్డు మరమ్మతులు త్వరగా పూర్తి చేసి ఇబ్బందులు తొలగించాల్సిందిగా ప్రజలు కోరతున్నారు.



కుంచే నానికి వేదవ్యాస్ అభినందన

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమితులైన కుంచే నానిని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఉపసభాపతి బూరగడ్డ వేదవ్యాస్ అభినందించారు. గురువారం వేదవ్యాస్‌ను కుంచే నాని కలిశారు. తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. కుంచే నాని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణను, సీనియర్ టీడీపీ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి, సంక్షేమం

గూడూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో దూసుకుపోతోందని సర్పంచ్ మహమ్మద్ రఫీ అన్నారు. ఆకులమన్నాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం గ్రామసభ నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు కోళ్ల లక్ష్మణరావు, ఎజ్జు శివాజీ, ఉపసర్పంచ్ బాకీ నాని, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, సచివాలయ, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలకు స్పందన

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : జాతీయ కళా సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్మలా స్కూలులో గురువారం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన వక్తృత్వ పోటీలకు మంచి స్పందన లభించింది. 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు సంస్థ కన్వీనర్ డాక్టర్ ఉడత్తు శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. టీచర్లు మాధవి, బిందు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత స్థాయి సాధ్యం

ఘంటసాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే అభివృద్ధి సాధ్యమని సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్ పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 74వ వార్షికోత్సవం గురువారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. రవి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించిన ఎంతో మంది ఉన్నత రంగాల్లో స్థిరపడ్డారని తెలిపారు. క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసిస్తే లక్ష్యాన్ని సాధించవచ్చునని తెలిపారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ రవి ప్రసాద్

హెచ్ఎం అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి మాట్లాడుతూ పట్టుదలతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చునని తెలిపారు.

వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు, గోగినేనిపాలెం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం తమ్మన వేణుగోపాలరావు, గ్రామప్రముఖులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయితీ కార్యాలయం - పులిగడ్డ

ఆర్.ఓ.సి.నెం. 18/2025 **టెండరు నోటీసు** తేది. 17-04-2025

కృష్ణాజిల్లా, అవనిగడ్డ మండలం, పులిగడ్డ గ్రామపంచాయతీలో ఈ దిగువ తెలిపిన షెడ్యూలు దాఖలా మంచినీటి సరఫరా విడి భాగములు 2025-26 సంవత్సరమునకు గాను సీల్డు టెండర్లు **ది.21-04-2025వ** తేదిన ఉదయం 11.00 గంటల వరకు స్వీకరించబడును. మరియు 12.00 గంటలకు హాజరైన టెండరుదార్ల సమక్షంలో సదరు టెండర్లు తెరువబడును. మిగిలిన వివరములు కార్యాలయము పనిచేయు వేళల్లో తెలుసుకొనవచ్చును.

వ. నెం.	టెండరు వివరములు	టెండరు కాలపరిమితి	చెల్లించవలసిన ధరావత్తు
1	మంచి నీటి సరఫరా విడి భాగములు	1-4-2025 నుండి 31-3-2026 వరకు	రూ. 5,000/-

నోట్ : 1) గ్రామ పంచాయితీ నిధుల నిల్వనుబట్టి బిల్లులు చెల్లించబడును.

సం/- **శ్రీమతి బి. అనిత, కార్యదర్శి, గ్రామపంచాయతీ - పులిగడ్డ**



ఇంటర్‌లో ప్రతిభ చూపిన గురుకుల కళాశాల విద్యార్థినిని అభినందిస్తున్న నాయకులు, ఆర్థిక సాయం అందిస్తున్న సహచర పూర్వ విద్యార్థి

నిరుపేద విద్యార్థినికి అభినందన, ఆర్థిక సహాయం

చల్లపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ఫలితాల్లో 957 మార్కులు సాధించిన చల్లపల్లి గురుకుల బాలికల కళాశాల విద్యార్థిని మునిపల్లి వినీతను బీసీ, దళిత, ప్రజాసంఘాల నేతలు గురువారం ఘనంగా సన్మానించారు. చల్లపల్లిలో రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట విద్యార్థిని వినీత, తల్లిదండ్రులు మునిపల్లి జయకృష్ణ - సీత దంపతులను అభినందించారు. పేద కుటుంబం కావటంతో విద్యార్థిని ఉన్నత విద్యాభ్యాసానికి కొంతమేర సాయమందించారు. బీసీ సంఘం నేత అందె జగదీష్ విద్యార్థినిని సత్కరించి నగదు బహుమతి అందించగా, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, వీఆర్వో ఓగిరాల నాగమల్లేశ్వరరావు, విశ్రాంత ఈవోఆర్డీ దాసి సీతారామరాజు, విశ్రాంత ఫోర్‌మెన్ ఉప్పల సాంబశివరావు, కాంగ్రెస్ పార్టీ నేత మీర్ రిజ్వాన్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కైతేపల్లి దాస్, రమాబాయి, అంబేద్కర్ సేవాసంఘం నేతలు స్పందించి విద్యార్థిని అభినందించి తమవంతుగా ప్రోత్సాహక నగదును అందించారు. మునిపల్లి బుజ్జి, మేరుగు రమేష్, మాతంగి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న మిత్రుడికి ఆర్థిక సాయం

పెడన/పెడన రూరల్ : అనారోగ్యంతో బాధపడుతున్న మిత్రునికి పదోవ తరగతి పూర్వ మిత్రులు ఆర్థిక సహాయం అందజేశారు. పెనుమల్లి జడ్పీ హైస్కూల్‌లో 1992-93లో టెన్త్ చదువుకున్న చోడవరం గ్రామవాసి దాసి తాతారావుకు బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురయ్యాడు. చికిత్స చేయించుకునే స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న సహచర మిత్రులు లక్ష రూపాయలు సేకరించి చోడవరం వెళ్లి రూ.75 వేలు అతని కుమార్తె పేరున బ్యాంక్‌లో డిపాజిట్ చేసి, వైద్య ఖర్చుల కోసం రూ.25 వేలు తాతారావుకు అందించారు. మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి శీరం ప్రసాద్, కాగిత నాగేశ్వరరావు, మట్టా శాంతి, కృష్ణవేణి, రాజ్యలక్ష్మి, ఊస వాసు, సుంకర ధన లక్ష్మి, పాశం నాగశ్రీనివాసరావు, పోలగాని రాము, పామర్తి రాము, జన్ను సుధారాణి, బొల్లా సుజాత, ఉప్పాల కృష్ణప్రసాద్, మాన్యం హరినారాయణ, రవికుమార్, నాగలక్ష్మి, పోలగాని రాము, సుచరిత, శ్రీదేవి, మిత్రులు పాల్గొన్నారు.

తెలుగు సాహితీ సంబరాలకు వాణికి ఆహ్వానం

నాగాయలంక, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మే నెల 10, 11 తేదీల్లో ఏలూరులో శ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగే ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల్లో పాల్గొనేందుకు బందలాయిచెరువు గ్రామానికి చెందిన ఉగాది పురస్కార గ్రహీత సింహాద్రి వాణికి ఆహ్వానం అందింది. వాణి మాట్లాడుతూ, సంబరాల్లో పాల్గొనే అవకాశం కల్పించినందుకు నిర్వాహకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



అన్నయ్యపై తమ్ముడి దాడి

కోడూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : అన్నయ్యపై తమ్ముడు రాడ్డుతో దాడిచేసి గాయపరిచిన సంఘటన మండల పరిధిలోని ఉల్లిపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. గల్లా రామాంజనేయులు అవనిగడ్డలో నివాసం ఉంటున్నాడు. గురువారం స్వగ్రామం ఉల్లిపాలెం గ్రామంలో నివాసముంటున్న తల్లిని చూసేందుకు వెళ్లాడు. దారిలో తమ్ముడు శేషాద్రి పైపులు, బండరాళ్లు వేయటంతో అవి తీయమని అడిగాడు. దీంతో అన్నయ్యపై శేషాద్రి రాడ్డుతో దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై చాణక్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వేసవి దృష్ట్యా అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు ఎలా తీసుకోవాలో గురువారం విద్యార్థులకు అగ్నిమాపకదళం అవగాహన కల్పించారు. నిర్వహించారు. వివిధ విద్యా సంస్థల వద్దకు వెళ్లి అగ్నిమాపక సిబ్బంది ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు నిర్వహించారు.

మట్టి పరీక్షలతో తక్కువ పెట్టుబడి, ఎక్కువ దిగుబడి

మోపిదేవి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక ప్రయోజనాలు పొందవచ్చునని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ సంధ్యారాణి తెలిపారు. వెంకటాపురం, ఉత్తర చిరువోలులంక గ్రామాల్లో మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షల ప్రాధాన్యతపై అవగాహన సదస్సులు గురువారం నిర్వహించారు. ఆయన గ్రామాల రైతులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులతో కలసి శాస్త్రవేత్తల బృందం మట్టి నమూనాలు సేకరించే విధానంపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు మంజువాణి, నవీన్, వెంకట లక్ష్మి, యశ్వంత్ తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయం మేలు

పెట్టుబడులు అధికంగా పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో రైతులు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలని ప్రకృతి వ్యవసాయ డీపీఎం పార్థసారథి తెలిపారు. రావివారిపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుత వేసవికాలంలో రైతులు భూసారాన్ని పరిక్షించుకునే అంశంపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని పచ్చిరొట్ట మిశ్రమాన్ని తయారు చేసుకుని పొలాల్లో చల్లుకోవాలన్నారు. పచ్చిరొట్ట మిశ్రమాన్ని తయారు చేసే విధానాన్ని రైతులకు ప్రదర్శనా పూర్వకంగా తెలియజేశారు. ఏవో కె.హెబ్సిబా రాణి, సీఆర్పీలు పాల్గొన్నారు.



మట్టి నమూనాలపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు



రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు

శాస్త్రవేత్తలు మినుము క్షేత్ర సందర్శన

చల్లపల్లి : శాస్త్రవేత్తల బృందం గురువారం పుచ్చగడ్డ గ్రామంలో మినుము పంటను క్షేత్ర స్థాయిలో సందర్శించారు. సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి పలు సూచనలు చేశారు. మినుము పంటలో రసం పీల్చే పురుగు నిర్మూలనకు ఇమిడక్లోప్రిడ్ 0.3 మి.లీ లేదా అసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చెయ్యాలని తెలిపారు. డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.